
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 19 మార్చి 2025 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6.22 బుధవారం సాయంత్రం
సహర్: 4.48 గురువారం ఉదయం

పూతరేకుల్లో కల్తీనెయ్యి
» కేసులు నమోదు చేస్తాం : ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్
7

రాజమండ్రికి చెందిన ఓ కాంట్రాక్టరు ఫేస్ బుక్ చూస్తూ ఓ యాడ్‌పై క్లిక్ చేశా డు. ఇంకేముంది..తక్కువ సమయంలో కోట్లు సంపాదిం చవచ్చని కనబడింది. యాప్ డౌన్‌లోడ్ చేసు కున్నాడు. ముందు కొంత సొమ్ము పెట్టుబడి పెట్టాడు. రెట్టింపు వచ్చినట్టు యాప్‌లో చూపించింది. ఎప్పుడైతే యాప్‌లో తన వివరాలను నమోదు చేశాడో ఇతడి క్రెడిట్ కార్డుల నెంబర్లు, పిన్‌లతో సహా అవతలి వ్యక్తులకు వెళ్లిపోయాయి. మూడు రోజుల్లో అవి ఉపయోగించి రూ.50 లక్షలు దోచేశారు. యాప్ పని చేయడం ఆగిపోవడంతో మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

కాకినాడ జగన్నాథపురానికి చెందిన ఓ యువకుడు ఈజీగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ మాత్రమే ఆదాయ మార్గమని తన స్నేహితుడి ద్వారా తెలుసుకున్నాడు. వెంటనే యాప్‌లను డౌన్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మొదట రూ.20 నుంచి మొదలు పెట్టిన ఈ ఆటకు అంతే లేకుండా పోయింది.అప్పులు చేసి మరీ ఈ బెట్టింగ్ యాప్‌ల్లో ఆడాడు.. తీవ్రంగా నష్టపోయాడు. తనకున్న సొంతింటిని అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

సామర్లకోట మండలం వేట్లపాలెంలో రెవె న్యూ శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా సిబ్బంది భర్త ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అల వాటుపడ్డాడు.తన భార్య బంగారు ఆభరణాలను తాకట్టుపెట్టి మరీ బెట్టింగ్ కాసి ఉన్నదంతా పోగొట్టుకున్నాడు.ఏమీ చేయలేని నిస్సహాయతతో ఇంటికి వెళ్లే ధైర్యం లేక అజ్ఞాతంలోకి వెళ్లాడు.

కాకినాడకు చెందిన ఒక యువకుడు (20) టైల్స్ షాపులో పనిచేసేవాడు. అతను ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఆన్‌లైన్‌లోనే అప్పుల పాలయ్యాడు.. చివరకు తీర్చేదారిలేకపోయింది. ఒక రోజు ఇంటికి వచ్చి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు.. చనిపోయిన తరువాత అతడు సెల్‌ఫోన్ చూస్తే అంతా తెలిసింది.

పరీమ్యాచ్, బెట్ 365, డ్రాఫ్ట్‌కింగ్స్, ఫాన్ డ్యూయల్, 1ఎక్స్‌బెట్, బెట్ఎంజీఎం, టాజ్777, టార్గెట్‌గేమ్స్.. ఇవన్నీ ఏంటో అనుకుంటున్నారా.. బెట్టింగ్‌ల యాప్‌ల పేర్లు.. 'వీటిలో జస్ట్ కొద్దిగా డబ్బులు పెట్టండి.. వెలకమ్ బోనస్ వస్తుంది..' అంటూ సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూ యెన్సర్స్‌తో యాప్‌ల ప్రమోషన్లు చేసి యువతను టెంప్ట్ చేస్తారు.వీటి మాయలో పడిన యువత త్వరగా డబ్బు సంపాదించాలనే కోరికతో డబ్బులు పెట్టీ.. పెట్టీ.. పెట్టీ నష్టపోతున్నారు. అప్పులపాలవుతున్నారు.. చేసిన తప్పును ఎవరికీ చెప్పుకోలేక..ఆ నరకం నుంచి బయటపడలేక ఆత్మహత్య చేసుకోవడమో.. అదృశ్యం కావడమో చేస్తున్నారు.. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లు చేస్తున్న కొందరు ఇన్‌ఫ్లూ యన్సర్లపై తెలంగాణ పోలీసులు కేసులు నమోదు చేశారు. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లో ఈ యాప్‌ల బారినపడి నలిగిపోతున్న యు వత పరిస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ప్రాణాలతో.. సెలగాటం!



యాప్‌ల...ట్రాప్‌లో జీవితాలు నాశనం

- » బెట్టింగ్ యాప్‌లపై ఆసక్తి
- » సోషల్‌మీడియాలో ప్రమోషన్లు
- » ఇన్‌ఫ్లూయెన్సర్స్‌తో ప్రచారం
- » వలలో పడుతున్న జనం
- » ఈజీ మనీ కోసం వెంపర్లాట
- » నష్టపోయినా..ఆగని వేట
- » తీరని అత్యాశతో అప్పులు
- » నిండా మునుగుతున్న వైనం
- » ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య
- » గుట్టుగా బెట్టింగ్ వ్యాపారాలు
- » తెలంగాణలో కేసులు నమోదు
- » ఉమ్మడి జిల్లాల్లో పట్టని పోలీసులు

(రాజమహేంద్రవరం/అమలాపురం, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చోరీ కేసులు, గంజాయి రవాణా వంటి నేరాల వెనుక ఆన్‌లైన్ బెట్టింగ్ బూచీ లింక్ అయి ఉంటోంది. నేరాలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా యువత, నడి వయస్కులు ఉంటున్నారు. వీళ్లు నేరాల ద్వారా సంపాదించిన సొమ్మును బెట్టింగ్‌లకు వెచ్చిస్తున్నారు. లేదంటే బెట్టింగ్‌ల వల్ల అప్పులపాలై వాటిని తీర్చడానికి వక్రమార్గాన్ని అనుసరిస్తున్నారు. కొంత మంది ప్రాణాలు తీసుకుంటున్నారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కాసుల కక్కుర్తితో ఇస్తున్న ప్రకటనలు మరింత కీడు చేస్తున్నాయి.ఆస్తులు అమ్ముకొని బికారులుగా మిగిలినవాళ్లు, అప్పులు తీర్చడానికి దొంగలుగా మారినవారు ఎంతో మంది. బెట్టింగ్ యాప్‌లు ప్రాణాలు తీసిన ఘటనలెన్నో. ఇవేవీ బయటకు రావు..పోలీసు కేసుల్లో నమోదు కావు.



స్మార్ట్‌ఫోన్‌లోనే అన్నీ..

నేటి సాంకేతిక యుగంలో బెట్టింగ్ స్మార్ట్ ఫోన్‌లోకి వచ్చేయడంతో యువత ఆసక్తి చూపుతున్నారు. కలర్ ప్రిడిక్షన్, నెంబర్ ప్రిడిక్షన్.. క్రికెట్, కాసినో.. ఇలా అనేక రకాల విదేశీ యాప్‌లు అందుబాటులోకి రావడంతో ఈజీగా డబ్బులు సంపాదించొచ్చనే ఆశతో డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు.ఎక్కువగా ఉమ్మడి జిల్లాల్లోని గ్రామీణ యువత వీటి బారినపడి నలిగిపోతున్నారు.

విద్యార్థులు, ఉద్యోగులు..

బెట్టింగ్ యాప్‌ల వలలో స్టూడెంట్స్, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వాళ్లూ పడుతున్నారు. ముందు సరదాగా మొదలుపెట్టినా తర్వాత వ్యసనంగా మారిపోతోంది. బెట్టింగ్ యాప్‌ల వలలో ఎక్కువగా చదువుకున్న వారే ఉంటుండడం ఆందోళన కలిగిస్తోందని సర్వేలు చెబుతున్నాయి. ఏఐ సాంకేతికత, అల్గారిథమ్స్ వంటి అధునాతన టెక్నాలజీలతో యాప్‌లు తయారు చేస్తుండడంతో యాడ్‌ల రూపంలో ఎలాగైనా డబ్బు సంపాదించాలనే బలహీనతను అవి క్యాష్ చేసుకుంటున్నాయి. యాప్‌ల వలలో పడి నష్టపోతున్న వారు కోకొల్లలు.వీరిలో 99 శాతం మంది పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. మరో వైపు పోలీసులు పట్టించుకోవడంలేదు . బెట్టింగ్ యాప్‌లపై చైతన్యం తీసుకురాలేకపోతున్నారు. దాదాపు 90 శాతం మంది విద్యార్థులు, ఖాళీ సమయం దొరికేవాళ్లు బెట్టింగ్ యాప్‌లపై మొగ్గు చూపుతున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో క్రికెట్ బెట్టింగ్‌లకు ఏకంగా ఒక కార్యాలయమే తెరిచేశారంటే పోలీసుల నిఘా ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తూర్పు గోదావరిలో 2023లో నిడదవోలు, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో కేవలం రెండు క్రికెట్ బెట్టింగ్ కేసులు మాత్రమే నమోదు కాగా..2024లో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2025లో రాజానగరంలో ఒక్క కేసు నమోదైంది. వాస్తవానికి బెట్టింగ్ యాప్‌ల గురించి యాడ్‌లు ఇచ్చినా..వాటిని ప్రమోట్ చేసినా పోలీసులు కేసులు పెట్టవచ్చు.కానీ ఆ దిశగా ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లా లో ఒక్క ప్రయత్నమూ లేదు.

నాడు వైసీపీ నేతల దందా..

ఐపీఎల్, టీ 20 వంటి ఇతర సీజన్ల సమయంలో క్రికెట్ బెట్టింగ్ యథేచ్ఛగా సాగుతోంది. కాకినాడ కేంద్రంగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ బెట్టింగ్ భారీగా సాగింది. స్థానిక వైసీపీ నాయకుడి ముఖ్య అనుచరులే ఈ బెట్టింగ్ కార్యకలాపాలకు మధ్యవర్తులుగా ఉండి నిర్వహించేవారు. లక్షలాది రూపాయలు పందేలు కాసిన వారెందరో ఈ క్రికెట్ బెట్టింగ్ బారిన పడి అప్పులపాలైనట్టు తెలుస్తోంది. అప్పట్లో ఎవరూ దీనిపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేని పరిస్థితి.ప్రత్యేకంగా బుకీలను ఏర్పాటు చేసుకుని మరీ గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారాన్ని నడిపిన కొందరు కోట్లు సంపాదిస్తున్నారు. ఈ తరహా ఇతర ప్రాంతాల్లో కూడా కొందరు వెనకుండి యాప్‌లను నిర్వహిస్తూ యువతను బెట్టింగ్ మాయలోకి దింపుతున్నారు.

అక్కడ లీగల్..ఇక్కడ ఇల్లీగల్?

బెట్టింగ్ యాప్ నిర్వాహకులు అధికశాతం విదేశాల నుంచి ఆపరేట్ చేస్తుంటారు. నైజీరియా, కెన్యా, ఫిలిప్పైన్స్, మెక్సికో వంటి చాలా దేశాల్లో జూదం లీగల్.అంటే జూదాన్ని అక్కడి చట్టాలు అనుమతిస్తాయి. అంతెందుకు మన దేశంలో కేరళ వంటి కొన్ని రాష్ట్రాల్లో లాటరీ టికెట్లను బహిరంగంగా అమ్ముతుంటారు.ఇలా ఒక చోట చట్టబద్ధమైన పని, మరో చోట చట్ట ఉల్లంఘన కింద ఉంటోంది. అందువల్ల బెట్టింగ్ యాప్‌ల్లో సొమ్ము పోగొట్టుకుంటే తిరిగి చేతికి రావడం అసాధ్యం. పోలీసులు ఎంత శ్రమించినా 10 శాతం ఫలితాలు సాధించలేక పోవచ్చు. ఇక్కడ బెట్టింగ్ యాప్‌ల్లో దోచుకున్న సొమ్ము విదేశాల్లోని నేరగాళ్ల ఖాతాలకు చేరుతుంది. దాన్ని వెనక్కి రప్పించడం ఎంతో కష్టం.


ఈ నెల 3న రాజానగరంలో పట్టుబడిన క్రికెట్ బుకీలు

మనోళ్లే..క్రికెట్ బుకీలుగా..

రాయవరం: ఈ నెల 3న జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇండియా-ఆస్ట్రేలియా లీగ్ మ్యాచ్‌పై రాయవరం మండలం సోమేశ్వరం, రాజానగరం మండలం చక్రద్వారబందంలో ఆరుగురు క్రికె ట్ బుకీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.4 ల్యాప్‌టాప్‌లు,50 సెల్‌ఫోన్లు, రెండు ఎల్ఈడీ టీవీలు, రెండు లైన్‌బాక్స్‌లు,రూ.7.38 లక్షల నగదు కలిగిన బ్యాంక్ ఖాతా ఫ్రీజ్‌చేశారు.

రాజానగరం : తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబందం బ్రిడ్జి కౌంటీలోని బి-12 విల్లాలో దుబాయ్ కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్టు పోలీసులు నిర్ధారించారు. కర్ణాటక,భీమవరానికి చెందిన 12 మందిని అరెస్టు చేశారు.ఈ ముఠాలో భీమవరానికి చెందిన వినీత్ దుబాయ్ వెళ్లి అక్కడి నుంచి పలు రకాల పేర్లతో వెబ్‌సైట్లను నిర్వహిస్తున్నట్టు తెలు సుకున్నారు. ఇటీవల ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తుండగా అరెస్టు చేశారు.

రోడ్ల నిర్మాణంలో గట్లు జారిపోకుండా..
జియోటాక్స్‌టైల్‌మేట్‌ల వినియోగం

» కలెక్టర్ మహేష్‌కుమార్


ఇంజనీర్ల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టాలోని భౌగోళిక పరిస్థితులతోపాటు భూస్థితిగతులను దృష్టిలో ఉంచుకుని రహదారుల నిర్మాణంతోపాటు కాల్వలు, డ్రైన్ గట్లు జారిపోకుండా బలోపేతం చేసేందుకు కొబ్బరిపీచుతో తయారు చేసిన జియోటాక్స్‌టైల్ మేట్‌లను వినియోగించేలా విధివిధానాలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ విభాగాల ఇంజనీర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి జియో టాక్స్‌టైల్స్‌మేట్‌లతో పదికాలాలపాటు మన్నికగా ఉండేలా రోడ్ల నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. ఓఎన్జీసీ, ధాన్యం లోడు లారీలు, భారీ వాహనాలరద్దీ కి అనుగుణంగా ప్రామాణిక ధరలకు అదనంగా సాంకేతికపరంగా ఖర్చులను జోడిస్తూ కిలోమీటరుకు అయ్యే ఖర్చులను ఇంజనీర్లు గణించాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మెటీరియల్ గ్రాంట్‌తో నిర్మించే రోడ్లకు జియో టాక్స్‌టైల్స్, జియో సింథటిక్ సాంకేతికతను జోడించేలా ప్రతిపాదించాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎల్డీఎం కేశవవర్మ, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, డ్రైనేజీ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ ఎంవీవీ కిషోర్, పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందించాలి: కలెక్టర్


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల లక్ష్యాలకుఅనుగుణంగా లబ్ధిదారులకు రుణాలు అందించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ బ్యాంకర్లను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం లీడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన సంప్రదింపుల కమిటీ జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశాలను సంయుక్తంగా నిర్వహించారు. వ్యవసాయరంగంలో కౌలురైతులకు పంట రుణాలు తప్పనిసరిగా అందించాల్సిన బాధ్యత బాంకర్లపై ఉందన్నారు. రూ.10కోట్లలోపు వ్యయంతో నిర్మించే వంతెనలకు బ్యాంకు రుణం అందించేలా ఆలోచన చేయాలన్నారు. ఆ రుణాన్ని టోల్ రూపంలో వసూలు చేసి తిరిగి చెల్లిస్తామన్నారు. విదేశాలకు ఉద్యోగ రీత్యా వెళ్లేవారికి అన్ని ప్రామాణిక అనుమతులను ఇప్పిస్తామన్నారు. ప్రాధాన్యరంగాలకు ఎక్కువగా నిధులు కేటాయిస్తూ బ్యాంకులవారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. వార్షిక రుణ ప్రణాళిక కింద 2024, డిసెంబరు నాటికి చూస్తే వ్యవసాయ రంగానికి సంబంధించి 94.53శాతం లక్ష్యాన్ని సాధించామని తెలిపారు. ఎంఎస్ఎంఈ నిర్దేశిత లక్ష్యసాధనలో 103.91శాతం సాధించామన్నారు. కొబ్బరి అనుబంధ పరిశ్రమలకు ఇతోధికంగా రుణాలు అందించాలన్నారు. ఆర్‌బీఐ అంధులకోసం బ్రెయిలీ లిపితో రూపొందించిన ఆర్థిక అక్షరాస్యత పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. తొలుత లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ గత సమావేశపు మినిట్స్‌పై తీసుకున్న చర్యలను వివరించారు. లీడ్ బ్యాంక్ కన్వీనర్ సాయిమనోహర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.కేశవవర్మ, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ట్రాన్స్‌కోఎస్ఈ ఎస్.రాజబాబు, సిడ్బి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో సిమెంటు బస్తాల వ్యవహారంపై
కలెక్టర్ సీరియస్
» చీఫ్ సూపరింటెండెంట్, హెచ్ఎంలపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశం
» డీఈవో సలీంబాషా వెల్లడి
7

నేర పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని
జోడించాలి
» ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
» అమలాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలన
6


కాకినాడలో..
'కోర్టు' చిత్ర యూనిట్ సందడి
అధిక రేట్లకు సినిమా టిక్కెట్‌ల అమ్మకాలు
» ఆర్డీవో తనిఖీ
» థియేటర్ సీజ్
6

ఏదీ వదలరు!


ప్రభుత్వ భూమిలో వెలసిన దుకాణాలు

» కాట్రేనికోనలో యథేచ్ఛగా భూముల కబ్జా
» చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

కాట్రేనికోన, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల కబ్జా కొనసాగుతోంది. ఓల్డ్‌అయినాపురం వంతెన సమీపంలోను, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలవద్ద ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. డ్రైనేజీ, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ, ఆర్అండ్‌బీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ప్రభుత్వ భూములను మట్టితో కప్పేసి అమ్ముకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా వెనుకాడుతున్నారు. కాట్రేనికోన-కుండలేశ్వరం రహదారి విస్తరణకు రూ.50కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, విస్తరణలో ఈ ఆక్రమణలన్నీ తొలగిస్తామని అధికారులు అంటున్నారు. ఎంపీడీవో కార్యాలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బార్లు నిర్వహిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న అన్నక్యాంటీన్ పరిసరాల్లో ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఆర్అండ్‌బీ రహదారిపై మెటీరియల్స్ అమ్మకాలు చేసే వ్యాపార సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

'జవాబు పత్రాల మూల్యాంకనంలో స్క్రూటీనైజర్స్ పాత్ర కీలకం'

అమలాపురం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జవాబుపత్రాల మూల్యాంకనంలో స్క్రూటీనైజర్స్ పాత్ర ముఖ్యమైనదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు అన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ మూల్యాంకన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సమావేశం నిర్వహించారు. మూల్యాంకనంలో భాగంగా స్క్రూటీనైజర్స్ స్క్రూటినీ చేసే విధానాన్ని వివరించారు. అసిస్టెంట్ ఎగ్జామినర్స్ దిద్దిన పేపర్లను, చీఫ్ ఎగ్జామినర్స్ వెరిఫై చేసిన పేపర్లను పరిశీలించి విద్యార్థులకు నష్టం జరగకుండా చూసే బాధ్యత స్క్రూటినైజర్స్‌దేనన్నారు. వై.లక్ష్మణరావు, అడబాల శ్రీనివాస్, ఇన్‌చార్జి ఇ.సువర్ణకుమార్ పాల్గొన్నారు.

ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రిడ్జికోర్సు పరీక్షలు మంగళవారం జిల్లాలో 11 పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించామన్నారు. 1874మంది విద్యార్థులకుగాను 1594మంది హాజరుకాగా 280మంది గైర్హాజరయ్యారన్నారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆలమూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే జాగ్రఫీ పరీక్ష నిర్వహిస్తామని డీఐఈవో తెలిపారు.

కోకోండంత అండ!


కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగులో ఉన్న కోకో

- » కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకోపై దృష్టిపెట్టిన రైతులు
- » కోకో సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు
- » అంతర్జాతీయ విపణిలో కోకోకు మంచి డిమాండ్
- » సాగుకు సిద్ధం కావాలంటున్న ఉద్యానశాఖాధికారులు

(అమలాపురం, ఆంధ్రజ్యోతి)

కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా కోకో పంట సాగు రైతులకు లాభసాటిగా మారనుంది. కోకో సాగుకు ప్రభుత్వం కూడా దశలవారీగా ప్రోత్సాహకాలు అందజేస్తూ వారిని సాగువైపు దృష్టి సారించేలా చేస్తోంది. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగును పెంచే దిశగా ప్రభుత్వం చేస్తున్న చర్యలనుంచి స్పందన లభిస్తోంది. కోకో సాగు విలువ ఆధారిత ఉత్పత్తులపై రైతులకు ఇటీవల ఉద్యాన శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించారు. కొబ్బరితోటల్లోనే కోకో సాగుకు అనువైన ప్రాంతంగా గుర్తించిన అధికారులు ఆయా పంటల్లో కోకో సాగు కోసం రైతులను ప్రోత్సహిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో ఉత్పత్తులకు అత్యధిక డిమాండ్ ఉంది. కోకో సాగుకు సంబంధించిన ఉత్పత్తులు చాక్లెట్లు, ఇతర పానీయాలతోపాటు మందులు, సౌందర్య సాధనాల తయారీలో ప్రధాన భూమిక వహిస్తాయి. ప్రస్తుతం జిల్లాలో 2,400 ఎకరాల్లో కోకో పంట సాగవుతోంది. రానున్న రోజుల్లో అదనంగా వెయ్యి ఎకరాలు, రెండో ఏడాదిలో 2వేల ఎకరాలు, మూడో ఏడాదిలో 3వేల ఎకరాల విస్తీర్ణంలో దశలవారీగా కోకోసాగును విస్తరింపజేయడానికి ఉద్యానవనశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఉద్యానవనశాఖ ద్వారా మొదటిఏడాది ఉచితంగా కోకో మొక్కలతోపాటు రూ.4,800 ఆర్థిక సాయం, రెండోఏడాది రూ.1600 నిర్వహణ ఎరువులకోసం, మూడోఏడాది రూ.1600 వంతున సబ్సిడీగా రైతులకు ఇవ్వనున్నారు.

రైతులకు ప్రోత్సాహకాలు

-బీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖాధికారి

కోకో పంటను కొబ్బరిలో అంతర పంటలుగా సాగు చేయాలనే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తుంది. ఉత్పత్తి అయిన కోకో గింజలకు గిట్టుబాటు ధర కూడా లభించేలా చర్యలు చేపట్టింది. ఏడాది పొడవునా కోకో పంట సాగు ఉంటున్న దృష్ట్యా మార్చినుంచి మే నెలాఖరు వరకు మూడునెలలపాటు అధిక దిగుబడి లభిస్తుంది. ఈ సమయంలో వచ్చిన గింజలు అధిక నాణ్యత కలిగి ఉండడం వల్ల బహిరంగ విపణిలో ఆశాజనకమైన ధరలకు రైతులు వాటిని విక్రయించుకునే వెలుసుబాటు ఉంటుంది. యాజమాన్య పద్ధతుల ద్వారా సాగు చేపట్టేందుకు సమీపంలోని ఉద్యానవనశాఖ అధికారుల సహాయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి.

ఆదాయం ఇలా..

ప్రస్తుతం జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా కొబ్బరి సాగు జరుగుతోంది. దీనిలో అంతర పంటగా కోకో విస్తరింపచేసే ప్రణాళికలను దశలవారీగా అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఎకరాకు 200 మొక్కలుగా నిర్ణయించి ఈ మొక్కలను నర్సరీల ద్వారా రైతులకు పంపిణీ చేస్తారు. కొబ్బరి సాగువల్ల గరిష్ఠంగా ఎకరాకు రూ.60వేల ఆదాయం వస్తుంటే కోకోవల్ల అదనంగా రూ.లక్షా20వేల వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా. సమగ్రంగా ప్రాసెసింగ్ చేసిన కోకోకు మంచి ధర లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. పంట విస్తీర్ణం పెరిగితే విలువ ఆధారిత పరిశ్రమలు స్థానికంగా ఏర్పటయ్యే అవకాశాలున్నాయి. ప్రస్తుతం ఈ పంట ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియా దేశాల్లో విస్తరిస్తోంది. కొబ్బరిలో కోకో సాగువల్ల ఆదాయం రైతులకు సమకూరుతుంది. 30ఏళ్ల పాటు దీనిద్వారా అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుంది. కోకో మొక్కలు నాటడానికి అనుకూలమైన వాతావరణం, వర్షపాతం, ఇసుకతో కూడిన ఎర్ర, నల్ల జిగురు నేలలు అనుకూలంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉప్పు, చౌడు నేలలు కోకో పంట సాగుకు పనికిరావు. కోకో పంట సాగుకు అత్యధికంగా నీటి అవసరం ఎక్కువ. 50 శాతం మేర నీరు ఈ తోటలకు అవసరం. జూలై, అక్టోబరు నెలల్లో కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో మొక్కలు నాటేందుకు అనుకూలమైన వాతావరణంగా అధికారులు చెబుతున్నారు. రెండు కొబ్బరి వరుసల మధ్య ఒక కోకో మొక్కల వరుస మధ్య దూరం పది అడుగులు ఉండాలని, నెలలు వయసు గల మొక్కలు నాటేందుకు ఉపయోగిస్తారు. ఎండిన పశువుల ఎరువను మట్టిలో కలిపి గుంతలు తీసి మొక్కలు నాటాలి. వేర్ల చుట్టూ ఉండే మట్టి కదలకుండా వేయాలి. నేల స్వభావాన్నిబట్టి పది రోజుల వ్యవధిలో క్రమంతప్పకుండా నీటి తడులు చేయాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకోకు డిమాండ్ ఉన్న దృష్ట్యా జిల్లాలో కూడా పంటలు పండించడానికి రైతులు ముందుకు వస్తున్నారు.



ప్లీజ్... ప్రాణం నిలపండి

- రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంటే కీలకం
- క్షతగాత్రుడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్తే రూ.25వేలు బహుమతి
- ప్రమాదాల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన 'గుడ్ సమరిటన్' పథకం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కళ్ల ముందు ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. కానీ వారిని కాపాడేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. క్షణాల్లో ఆసుపత్రిలో చేర్పించాలన్న ఆలోచన ఉన్నా భవిష్యత్‌లో కేసుల్లో ఇరుక్కోవలసి వస్తుందేమో, కోర్టుల చుట్టూ తిరగాలేమోనన్న అనుమానం.. భయం వెంటాడే పరిస్థితి. ఇలాంటి సంఘటనలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం 'గుడ్ సమరిటన్' పథకం తీసుకువచ్చింది. క్షతగాత్రుల్ని తక్షణమే ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలు కాపాడేలా చేసిన వారికి రూ.5వేలు ప్రోత్సాహకం ప్రకటించి అమలు చేసింది. తాజాగా ఆ మొత్తాన్ని రూ.25వేలకు పెంచింది.

ఎక్కువ మందిని కాపాడితే లక్ష

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందక సకాలంలో ఆసుపత్రికి తరలించక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. క్షతగాత్రుల్ని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు) ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిచే అవకాశాలెక్కువని వైద్యులు చెప్తున్నారు. ఇలా చేసిన వారికి పోలీసు కేసుల భయం లేకుండా గుడ్ సమరిటన్ చట్టం అండగా నిలుస్తుంది. ఎక్కువ మందిని కాపాడితే రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం అందిస్తారు.

ప్రోత్సాహకం పొందాలంటే..

ప్రాణాపాయంలో ఉన్న వారికి ఆస్పత్రికి తరలించే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే.. పోలీసులు అధికారికంగా లేఖ ఇస్తారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలతో పాటు పోలీసు శాఖ, ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి తహసీల్దార్‌కు దరఖాస్తు చేయాలి. రవాణా, రెవెన్యూ పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్అండ్‌బీ అధికారులతో కూడిన కమిటీ గుర్తించి నగదు ప్రోత్సాహకానికి ఎంపిక చేస్తుంది.



కేసుల భయం అవసరం లేదు

కె.శ్రీధర్, కాకినాడ జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిషనర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల్ని ఆసుపత్రికి తరలిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్న అపోహలు వద్దు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించినా, అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా పోలీసుల నుంచి ఇబ్బందులు ఉండవు. రోడ్డు ప్రమాద కేసులకు సాక్షులుగా ఉండాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో ఫోన్ నెంబర్ కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. అవసరాన్ని బట్టి పోలీసులే యూనిఫాం లేకుండా మీ ఇంటికి వచ్చి వివరాలు తెలుసుకుంటారు తప్ప మీరు పోలీస్‌స్టేషన్‌కి వెళ్లాల్సిన అవసరం లేదు. క్షతగాత్రుల్ని సకాలంలో ఆస్పత్రికి తీసుకువస్తే ఒకరి ప్రాణమే కాదు వారి కుటుంబం రోడ్డున పడకుండా కాపాడినవారవుతారు. అలాంటి వారిని ప్రభుత్వం ప్రాణదాతగా గుర్తించి ప్రశంసాపత్రంతో పాటు ప్రోత్సాహక నగదు కూడా అందజేస్తుంది.



బాగుంటే నలుగురికి చెప్పండి

- లేకపోతే వంద మందికి చెప్పండి
- 'కోర్ట్' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి
- కాకినాడ వాసిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటా: నటి శ్రీదేవి
- కాకినాడలో చిత్ర బృందం సందడి





కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సినిమా బాగుంటే నలుగురికి చెప్పండి.. లేకపోతే వంద మందికి చెప్పండని 'కోర్టు' మూవీలో కీలక పాత్రధారి ప్రియదర్శి అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ చిత్ర బృందం కాకినాడలో మంగళవారం సందడి చేసింది. నటీనటులు ప్రేక్షకులను అలరించారు. కీలక పాత్ర పోషించిన ప్రియదర్శి న్యాయవాదిగా తనదైన శైలిలో ఆకట్టుకున్నారు. అరుదైన పాత్ర తనకు రావడం అదృష్టమన్నారు. కథానాయిక చేసిన శ్రీదేవి కాకినాడ నగరవాసి కావడంతో చాలా మంది చూడ్డానికి వచ్చారు. కోర్టు చిత్రం విజయోత్సవ యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం సినిమా ప్రదర్శితమవుతున్న ఆనంద్ సినీ కాంప్లెక్స్‌ను చిత్ర బృందం సందర్శించింది. వారికి లక్ష్మీ టాకీస్ ప్రొప్రయిటర్ శ్రీనుబాబు స్వాగతం పలికారు. చిత్ర దర్శకుడు రామ్‌జగదీష్ మాట్లాడుతూ కథా బలంతో ఉన్న సినిమాలకు తెలుగు ప్రేక్షకులు పట్టడం కడతారన్నారు. నటి శ్రీదేవి మాట్లాడుతూ ఇంటర్ చదువుతున్న తనకు ఈ సినిమాలో నటించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కాకినాడ వాసిగా సినిమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తానన్నారు. డిస్ట్రిబ్యూటర్లు అయిన జగ్గంపేట వీరాంజనేయ ఫిలిమ్స్ అధినేతలు కొత్త శివ, బూర్లు సాయి, నటులు హర్షరోషన్, రామ్‌జగదీష్, సాంకేతిక బృందం సభ్యులు ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం చిత్ర బృందం వాకలపూడిలోని హీరోయిన్ శ్రీదేవి బంధువుల గృహానికి వెళ్లి సందడి చేశారు. హీరో, హీరోయిన్లతో శ్రీదేవి బంధువులు, చుట్టుపక్కల వారు సెల్ఫీలు తీసుకున్నారు.


అభిమానులతో సెల్ఫీ దిగుతున్న హీరో, హీరోయిన్ హర్షరోషన్, శ్రీదేవి

నేర పరిశోధనకు సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి

● ఏలూరు రేంజ్ ఐజీ జీవీకే అశోక్‌కుమార్

అమలాపురం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలు మెరుగ్గా నిర్వహించాలంటే ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత జోడించాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీ) జీవీకే అశోక్‌కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఆయనకు స్వాగతం పలికారు. తొలుత జిల్లా పోలీసు కార్యాలయంలోని అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని పరిశీలించి రికార్డులను అశోక్‌కుమార్ తనిఖీ చేశారు. అనంతరం జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో, జిల్లా ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో, స్పెషల్ బ్రాంచి విభాగాల రికార్డులను పరిశీలించారు. పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన జిల్లా కంట్రోల్ రూము, సోషల్ మీడియా విభాగాన్ని స్వయంగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉంటేనే జిల్లా పోలీసులకు మంచి పేరు వస్తుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేర పరిశోధనలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ ఎవీఆర్‌పీబీ ప్రసాద్, సీఐలు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఐజీ

నేడు 'ఆదిత్య'లో ఎండ్యురన్స్

● హాజరుకానున్న డాక్టర్ గంగారెడ్డి (బెంగళూరు)


ప్రో కార్టింగ్ ఎండురన్స్‌కి టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

గండేపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయంలో బుధవారం ఎండురన్స్ పోటీలు జరగనున్నాయి. వర్సిటీలో ఈనెల 17న ప్రారంభమైన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ ఛాంపియన్‌షిప్ 2025 సీజన్- 5 పోటీల్లో భాగంగా రెండోరోజు పలు టెక్నిక్ అంశాల్లో టెక్నికల్ టీమ్ పరిశీలించింది. వివిధ కళాశాలల నుంచి వచ్చిన టీమ్‌లు మండుటెండను సైతం లెక్కచేయకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ట్రయిల్‌రన్ నిర్వహిస్తూ టీమ్ సభ్యులు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని ... ఉత్కంఠను నింపారు. బ్రేకింగ్ టెస్ట్, యాక్సిల్ రేషన్, స్కిడ్‌పాడ్, ఆటోక్రోస్ టెస్ట్, తదితర డైనమిక్ ఈవెంట్స్ జరిగాయి. బుధవారం మధ్యాహ్నం రెండుగంటల నుంచి 3.30 గంటల వరకు ఎండురన్స్ జరగనున్నాయి.

ఉత్కంఠగా సాగే ఈ పోటీకి ముఖ్యఅతిథిగా డాక్టర్ గంగారెడ్డి (అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ హెడ్ ఆఫ్ అడ్వాన్స్డ్ ఇంజనీరింగ్ (గ్రూప్ బెంగళూరు) నుంచి వస్తున్నారని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు.

కాకినాడ తీరంలో సైనిక విన్యాసాలు

● వచ్చేనెల 8 నుంచి నిర్వహణ ● భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా.. ● కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావు వెల్లడి


సైనిక అధికారులతో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ తీరంలోని నేషల్ ఎన్‌క్లేవ్‌లో వచ్చేనెల 8వ తేదీ నుంచి 13 వరకు భారత్, అమెరికా వాయుసేన దళాలు ఉమ్మడిగా టైగర్ ట్రయంఫ్ -25 సైనికవిన్యాసాలు జరగనున్నాయి. దీనికోసం అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు. నిర్వహణపై కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం సైనిక, సివిల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే క్యాంపింగ్ సైట్‌లో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలన్నారు. అలాగే వారం రోజుల పాటు పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను సిద్ధంచేయాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను సూచించారు. అగ్నిమాపకశాఖ నీటితో నింపిన రెండు ఫైర్ ఇంజన్లు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైట్ బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్‌మళ్లింపు, కోడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. అలాగే సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం - కాకినాడ మధ్యసంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్‌కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్యశాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రయంఫ్‌ను విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో సహకరించాలన్నారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. సమావేశంలో సివిల్, మిలిటరీ లైజాన్ అధికారి కమాండర్ కిషోర్, సైనిక అధికారి టీవీవీ ప్రసాద్, మెరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సీఐ చైతన్యకృష్ణ, ఎంహెచ్‌వో పృథ్వీ, మత్స్యశాఖ అధికారి అనురాధ , తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అటవీ అకాడమీ సొంత భవన నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

దివాన్‌చెరువు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ సీఎం పవన్ చొరవతో కేంద్ర అటవీ పర్యావరణ శాఖ రాష్ట్ర అటవీశాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ ఈమేరకు తాజాగా ఆదేశాలిచ్చారు. ఇక్కడ నూతన భవన నిర్మాణం చేపట్టాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గత ఆగస్టులో పవన్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే దీన్ని కొనసాగించడంతో పాటు అక్కడే సొంత భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. దాంతో పవన్ ఈ విషయాన్ని కేంద్ర అటవీశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఎట్టకేలకు స్పందించిన కేంద్రం చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీచేసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన రాష్ట్ర అటవీ అకాడమీని దాదాపు ఎనిమిదేళ్లుగా రాష్ట్ర అటవీ పరిశోధనా భవనంలోనే నిర్వహిస్తున్నారు.

ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్ ప్రదర్శన

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ నోటిఫికేషన్ ప్రకారం భర్తీ చేయనున్న 3 ఫార్మాసిస్ట్, ఒక డీఈవో, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ - 4 పోస్టులకు అభ్యర్థుల ప్రొవిజినల్ లిస్టును ఎన్ఐసీలో ప్రదర్శించినట్టు కాకినాడ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ తెలిపారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు గ్రీవెన్స్‌లో ఇవ్వాలన్నారు. అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఈ దిగువ ఎన్ఐసీల్లో పరిశీలించుకోవాలని కోరారు. హెచ్‌టీటీపీ//ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ// కాకినాడ.ఏపీ.జీవోవీ.ఇన్, హెచ్‌టీటీపీ// కోనసీమ.ఏపీ.జీవోవీ.ఇన్. సందర్శించవచ్చు.

రాజమహేంద్రవరంలో కోర్ట్ సినిమా యూనిట్ సందడి


స్వామి థియేటర్‌లో సందడి చేస్తున్న చిత్ర బృందం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని స్వామి థియేటర్‌లో మంగళవారం కోర్ట్ సినిమా యూనిట్ సందడి చేసింది. చిత్రంలో పులికొండ లాయర్ పాత్ర పోషించిన ప్రియదర్శి, హీరో హర్షరోషన్, హీరోయిన్లు శ్రీదేవి, రిషిక, రైటర్ కమ్ డైరెక్టర్ రామ్‌జగదీష్, మ్యూజిక్ డైరెక్టర్ , తదితరులు పాల్గొని ప్రేక్షకులతో జోష్ కలిపారు. ఈ సినిమా మా అందర్నీ గెలిపించిందన్నారు. మంచి చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని మరోసారి ప్రేక్షకులు నిరూపించారన్నారు. నాని సహ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఎంతో అద్భుతంగా తెరకెక్కిందన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ ఈ చిత్రం రూపుదిద్దుకుందన్నారు. విడుదలైన మూడురోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల మేరకు కలెక్షన్స్ రావడం చిత్ర విజయానికి నిదర్శనమన్నారు. థియేటర్ యజమాని పులవర్తి లక్ష్మణస్వామి, జీబీఆర్ ఫిలిమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సినిమా థియేటర్ సీజ్

● అధిక ధరకు టికెట్ల విక్రయం ● రెవెన్యూ అధికారుల మెరుపుదాడి
● అమలాపురంలో శ్రీవెంకటరమణ సినిమా హాలులో ప్రదర్శన నిలిపివేత



థియేటర్ వద్ద మాట్లాడుతున్న ఆర్డీవో మాధవి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ధరలను పెంచి సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్‌పై రెవెన్యూ అధికారులు మెరుపుదాడి చేసి సీజ్ చేశారు. అమలాపురం పట్టణంలోని శ్రీ వెంకటరమణ థియేటర్‌లో కోర్టు సినిమా ప్రదర్శన టికెట్ ధర రూ.110కి విక్రయించాల్సి ఉండగా .. రూ.150 పెంచుతూ అమ్ముతున్నారని ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌కు ఫిర్యాదు అందింది. ఈ మేరకు మంగళవారం థియేటర్‌పై ఆకస్మిక దాడి చేశారు. ముందుగా అధిక ధరలు చెల్లించి టికెట్ కొనుగోలు చేసినవారు యాజమాన్యం తీరుపై విచారణ చేపట్టారు. గత మూడు రోజుల నుంచి టికెట్ ధరలను నిబంధనలకు విరుద్ధంగా పెంచి విక్రయిస్తుండడాన్ని తనిఖీల్లో గుర్తించామని ఆర్డీవో మాధవి మీడియాకు వెల్లడించారు. దీనికి తోడు ఫామ్-బీ లైసెన్సు కూడా రెన్యువల్ చేయనట్టు రికార్డుల తనిఖీలో వెల్లడైందన్నారు. తక్షణమే థియేటర్‌లో తదుపరి షోను నిలిపివేసి రికార్డులను స్వాధీనం చేసుకుని జేసీకి నివేదించారు. విచారణ పూర్తయ్యే వరకు షోలు నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అమలాపురం డివిజన్‌లో చాలా థియేటర్లలో ఫామ్-బి లైసెన్సులు రెన్యువల్ చేయకుండానే షోలు ప్రదర్శిస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నిబంధనలను ఎవరూ దాటొద్దన్నారు.

ఆ అధికారులపై చర్యలేవి?

- వైసీపీ పాలనలో నిధుల దుర్వినియోగం
- రంప ఐటీడీఏలో ఆరోగ్య కేంద్రాలకు రూ.62 లక్షలతో స్కానింగ్ యంత్రాల కొనుగోళ్లు
- గిరిజనులకు ఉపయోగం లేని పార్కు నిర్మాణం కోసం రూ.20 లక్షలు

(రంపచోడవరం/ఆంధ్రజ్యోతి)

వైసీపీ పాలనలో రంపచోడవరం ఐటీడీఏ ఉన్నతాధికారులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. అప్పటి ప్రభుత్వ అధినేత మన్ననల కోసం ప్రాకులాడి, నిబంధనలకు తిలో దకాలిచ్చారు. ఫలితంగా గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం వెచ్చించాల్సిన నిధులను ఐటీడీఏ పాలక మండలి ఆమోదాలు లేకుండానే చట్ట విరుద్ధ అంశాలకు సైతం వెచ్చించారు. స్కానింగ్ యంత్రాలను వినియోగించేందుకు చట్టపరమైన ఎటువంటి అనుమతులు, వాటి నిర్వహణకు అనుభవజ్ఞులైన నిర్వాహకులు లేకున్నా వాటిని కొనుగోలు చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా ప్రభుత్వ ఖజానాకూ నష్టం చేకూర్చిన అధికారి ఒక రైతే, రూ.20 లక్షల ఉపాధి నిధులను నిరుపయోగమైన పార్కు నిర్మాణానికి వెచ్చించిన వారు మరొకరు. కొనుగోలు చేసిన యంత్రాలను వినియోగించే అవకాశమే లేక నేడు నిరుపయోగంగా ఉన్నాయి.


ఓ పీహెచ్‌సీలో నిరుపయోగంగా ఉన్న స్కానింగ్ యంత్రం

ఎవరైనా స్కానింగ్ యంత్రాలను నిర్వహించాలనుకుంటే అది ఆసుపత్రి అయినా, లేక స్కానింగ్ సెంటరైనా చట్టప్రకారం అనుమతులుండాలి. కానీ రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు అటువంటి అనుమతులు ఉన్న దాఖలాలు లేవు. చట్ట విరుద్ధం గానైనా ఆయా స్కానింగ్ యంత్రాలను నిర్వహించే అనుభవము, అనుమతీ ఉన్న వైద్యులు, సాంకేతిక సిబ్బంది లేకుండానే వాడ పల్లి, జడ్డంగి, బోదులూరు, ఇందుకూరుపేట, దుప్పులపాలెం, నరసాపురం, పెదగెద్దాడ, చవటిదిబ్బలు, దేవీపట్నం, కొండమొదలు ఆరోగ్య కేంద్రాలకు రూ.62.69 లక్షలతో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను 2022, ఫిబ్రవరిలో కొనుగోలు చేశారు. రూ.37 లక్షలతో పీహెచ్‌సీల అంబులెన్సులు, 108 అంబులెన్సుల కోసం వైర్లెస్ డిజిటల్ రిపీటర్లు, డిజిటల్ బేస్ స్టేషన్లు, మొబైల్ సెట్లను కొనుగోలు చేశారు. రెండో విడత కొవిడ్ పేరుతో రూ.59.21 లక్షలతో అంబు బ్యాగ్‌లు, పల్స్ ఆక్సీమీటర్లను, రూ.12.10 లక్షలతో 64 లీటర్ల సామర్థ్యం గల 15 ఆక్సిజన్ సిలెండర్లను మే, 2021లో కొనుగోలు చేశారు.

మరో అధికారి కూడా రంపచోడవరంలో ఒక పార్కు నిర్మాణానికి రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులను దుర్వినియోగపర్చారు. ఉపాధి హామీపై జరిగిన ఆడిట్‌లో ఇది తప్పుగా అనిపించలేదు. ఈ ఇద్దరి అధికారుల నిర్ణయాలు వివాదస్పదంగానే రంపచోడ వరం ఐటీడీఏలో సాగాయి. పాలకమండలి ఆమోదం లేకుండానే గిరిజన నిధులను దుర్విని యోగపర్చినా వారిపై ఏ చర్యలూ లేవు. ప్రభుత్వం మారి 9 నెలలు గడిచినా నిధుల దుర్వినియోగ నిర్ణయాలపై చర్యలు లేకపోవడంపై సర్వత్రా గిరిజన వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెంటూరులో కారుణ్య అంత్యక్రియలు పూర్తి

రాయవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తండ్రి కర్కశానికి బలైన చిన్నారి పిల్లి కారుణ్య(7)కి మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వెంటూరులో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈనెల 17న వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు తన కుమార్తె కారణ్యను, కుమారుడు రామ్‌సందీప్‌ను స్కూల్ నుంచి ఇంటికి తీసుకువస్తూ రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు సమీపంలో గజపతినగరం వద్ద కాలువలో తోసేసిన ఘటన పాఠకులకు విదితమే. ఈ సంఘటనలో కారుణ్య కాలువలో కొట్టుకుపోయి మృతి చెందగా మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటూరులో రోదనల మధ్య అంత్యక్రియలు పూర్తిచేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన క్రమంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్థిక సమస్యలే కారణమా?

వెంటూరు గ్రామానికి చెందిన పిల్లి రాజు వ్యాపారలావాదేవిల నేపథ్యంలో ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు గ్రామంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజు తన పిల్లల్ని చంపి తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. పిల్లల్ని తోసేసిన తరువాత రాజు మాత్రం అక్కడి నుంచి తన మోటారు వాహనంపై పరారు కాగా, రెండో రోజు రాజు ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు సాంకేతికత ఆధారంగా రాజు ఆచూకీని కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాజు బతికి ఉన్నాడా లేక తాను చనిపోవాలని నిర్ణయించుకుని ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే మిస్టరీ వీడడం లేదు.

రాజు కోసం పోలీసుల గాలింపు


పిల్లి రాజు

ద్రాక్షారామ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కన్న పిల్లలను కాలువలోకి తోసి కుమార్తె మృతికి కారణమైన తండ్రి పిల్లి రాజు ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కారుణ్య మృతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. అప్పుల బాధ తాళలేక ఈ ఘోరానికి పాల్పడినట్టు భావిస్తున్నారు. ప్రాణాలతో బయటపడిన కుమారుడు సందీప్ ఘటన పూర్వాపరాలు వెల్లడించారు. పిల్లి రాజు(40) తన పిల్లలను కాలువలోకి తోసి ఏపీ39హెచ్‌కె 1660 నెంబరు గల సుజుకి యాక్సెస్ మెరూన్ కలర్ మోటార్ సైకిల్‌పై పారిపోయాడు. రాజు తెలుపు రంగు షర్టు, నలుపు/నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడి ఆచూకీ తెలిస్తే రామచంద్రపురం డీఎస్పీ 9440796507, సీఐ 34407965 36, ఎస్ఐ 9440904850లో సమాచారం ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐ ఎం.వెంకటనారాయణ కోరారు. ఈమేరకు రాజు ఫొటో విడుదల చేశారు.

పాఠశాలలో సిమెంటు బస్తాల వ్యవహారంపై
కోనసీమ కలెక్టర్ సీరియస్!

చీఫ్ సూపరింటెండెంట్, హెచ్‌ఎంలపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశం

డీఈవో సలీంబాషా వెల్లడి

అమలాపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణంలో నల్లవంతెన వద్ద గల ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు ముందు సిమెంటు బస్తాల తరలింపు వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పందించారు. ఈ వ్యవహారంపై వచ్చిన వార్తా కథనాలపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించారని ఆర్డీవో కె.మాధవి, డీఈవో షేక్ సలీంబాషాలు విచారణాధికారులుగా విచారణ చేసి నివేదికను కలెక్టర్ పరిశీలన కోసం పంపించారు. దీనిలో భాగంగా పరీక్షా సమయానికి కొన్ని గంటల ముందే సిమెంటు బస్తాలు తరలించడం వాస్తవమని నిర్ధారించారు. దాంతో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మీనాకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్ అలసత్వం వహించినట్టు విచారణలో వెల్లడి కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశించినట్టు డీఈవో ఆ ప్రకటనలో తెలిపారు. వారిద్దరిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటానని, ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని డీఈవో విజ్ఞప్తి చేశారు.

పేకాడుతున్న 19 మంది అరెస్ట్


జి.దొంతమూరులో పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న ఎస్‌ఐలు

రంగంపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ ఆధ్వర్యంలో మంగళవారం రంగంపేట, అనపర్తి ఎస్‌ఐలు తోట కృష్ణసాయి, ఎల్.శ్రీనునాయక్ సిబ్బందితో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామశివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 19 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,09,300 నగదు, 9 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని రంగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రంగంపేట ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


ట్రాఫిక్ ఎస్ఐతో బాలుడు

సామర్లకోట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట పోలీస్ అవుట్ పోస్ట్ సమీపాన రోడ్డుపై సుమారు 10ఏళ్ల బాలుడు అనుమానాస్పద స్థితిలో చేతిలో సెల్‌ఫోన్ పట్టుకుని తిరుగుతుండడాన్ని ట్రాఫిక్ పోలీసు సన్యాసిరావు, ఇతరులు గుర్తించి చేరదీశారు. బాలుడిని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు వద్దకు చేర్చారు. దీంతో పోలీసులు బాలుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో నంబర్ల ఆధారంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి వీడియో కాల్‌లో చూపించారు. వారు రావడంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు బాలుడిని అప్పగించారు. తమ కుమారుడిని క్షేమంగా అప్పగించిన ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు, పోలీసులకు తండ్రి బాంబీరామ్ వల్లీయప్పన్ కృతజ్ఞతలు తెలిపాడు.

పూతరేకుల్లో కల్తీనెయ్యి

ల్యాబ్ పరీక్షల్లో నిర్ధారణ

కల్తీ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్

ఆత్రేయపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం పేరు చెప్పగానే పూతరేకులు అని గుర్తుకువస్తుంది. ఇక్కడ తయారుచేస్తున్న పూతరేకులకు ఎంతో పేరు ఉంది. సుమారు ఐదు దశాబ్దాల నుంచి ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో సుమారు 400 కుటుంబాలు పైనే కుటీర పరిశ్రమలుగా పెట్టుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. మహిళలు తయారు చేస్తున్న ఈ పూతరేకుల వ్యాపారంతో గ్రామరూపురేఖలే మారిపోయాయి. ఈ వ్యాపారం దిన దిన అభివృద్ధి చెందుతూ దేశనలుమూలలతో పాటు ఖంతరాలు దాటిపోయింది. ఇళ్లల్లో జరిగే ఫంక్షన్లకు ఈ స్వీటును రుచి చూపిస్తారు. ఇంత పేరు,ప్రఖ్యాతలు ఉన్న ఈ పూతరేకుల్లో వాడే నెయ్యి విషయంలో కొంతమంది అక్రమార్కులు వ్యాపారం సాగిస్తున్నారు. కల్తీనెయ్యిని వాడుతూ స్వీటు ప్రియుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీనెయ్యి అమ్ముతున్న వ్యాపారస్తులకు అధిక ఆదాయం రావడంతో దీన్నే జోరుగా విక్రయిస్తున్నారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రతిరోజు వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తులు ఈ స్వీట్లను కొనుగోలుచేసుకుని బంధుమిత్రులకు రుచిచూపిస్తుంటారు. ఈ క్రమంలో గత కొంతకాలం నుంచి కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యి విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడులు

పూతరేకుల్లో కల్తీనెయ్యి వాడుతున్నారనే వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఫుడ్‌సేఫ్టీ అధికారుల బృందం ఫిబ్రవరి 17న కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో పూతరేకుల తయారీ షాపులు, కల్తీనెయ్యి అమ్మకాలు సాగిస్తున్న షాపులపై ముమ్మరదాడులు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. 160 కిలోల నెయ్యిని కల్తీ నెయ్యిగా అనుమానించి సీజ్ చేసి నమునాలను సేకరించారు. అలాగే వివిధ దుకాణాల్లో 8 సాంపిల్స్‌ను సేకరించి సీల్డ్ కవర్లలో భద్రపరిచారు. ఈ నెయ్యి సాంపిల్స్‌ను హైదరాబాద్ ల్యాబ్‌లకు పంపించారు. అక్కడ ఈ నెయ్యిలో కల్తీ జరిగినట్టు గుర్తించారు. ఫుడ్‌సేఫ్టీ కంట్రోలర్ శ్రీనివాస్ ల్యాబ్ రిపోర్టులో కల్తీ నెయ్యి వాడుతున్నట్టు నిర్ధారించినట్టుగా గుర్తించారు. కల్తీనెయ్యి అమ్ముతున్న, కొనుగోలు చేసి అమ్మకాలు చేస్తున్న షాపు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని తద్వారా వారిపై క్రిమినల్ కేసులు పెడతామని వివరించారు. వ్యాపారులు పూతరేకుల్లో విచ్చలవిడిగా కల్తీనెయ్యి వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు. త్వరలోనే కల్తీనెయ్యి అమ్మకం తయారీషాపులపై దాడులు నిర్వహిస్తామన్నారు. నాణ్యమైన నెయ్యి(బ్రాండ్) వాడాలని లైసెన్సు లేకుండా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్య లు తప్పవని స్పష్టం చేశారు.


కల్తీనెయ్యి ప్యాకెట్లు


ఆత్రేయపురంలో నిర్వహించిన దాడుల్లో నెయ్యిని సీజ్ చేసి ల్యాబ్‌కు పంపించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు(ఫైల్)

దెబ్బతిన్న పూతరేకుల ప్రతిష్ట

ఎన్నో ఏళ్ల నుంచి మహిళలు పూతరేకులు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి దగ్గర తయారుచేస్తున్న నెయ్యి, బ్రాండెడ్ నెయ్యిని వాడుతూ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా నిలతొక్కుకుంటున్నారు. కొంతమంది వ్యాపారులు కల్తీనెయ్యితో పూతరేకులను తయారుచేయడంతో ఆత్రేయపురం పూతరేకుల ప్రతిష్ఠ దెబ్బతింది. దీంతో కొంతమంది వ్యాపారులు లబోదిబోమంటున్నారు.

ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్

- అన్నవరం దేవస్థానంలో కాకినాడ జిల్లా కలెక్టర్ పరిశీలన
- అపరిశుభ్ర వాతావరణంపై అసహనం
- పంపా రిజర్వాయర్‌లో నీటి అంశంపై అధికారులతో చర్చ
- సత్యనికేతన్ సత్రం ఘటనపై త్వరలో చర్యలుంటాయని వెల్లడి


మరుగుదొడ్ల పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పర్యటించారు. సత్యదేవుని దర్శించిన అనంతరం నిత్యకల్యాణమండపం వద్ద నున్న మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంపై అసహనం వ్యక్తం చేశారు. స్వామివారి కల్యాణకట్ట వద్ద పరిసరాల అపరిశుభ్రతను గమనించి ప్రతి మంగళవారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని ఈవో సుబ్బారావుకు సూచించారు. అనంతరం పంపా రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోవడం తద్వారా గ్రామంలో నీటిఎద్దడి పొంచి ఉన్న నేపథ్యంలో దాని నివారణకు చర్యలపై పోలవరం, ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. సీతారాముల దివ్యకల్యాణోత్సవాలలో చక్రస్నానం, సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవాల చక్రస్నానానికి రిజర్వాయిర్‌లో నీటి అవసరాలపై చర్చించారు. పోలవరం అక్విడెక్టు వద్ద పనుల నేపథ్యంలో ఏలేరు నీరు పంపారిజర్వాయిర్‌కు మళ్లించడంపై సుమారు 10 కిలోమీటర్ల మట్టిరోడ్డులో ప్రయాణం చేసి పనులు పరిశీలించారు. పోలవరం పనులు త్వరితగతిన పూర్తిచేయాలనే ముఖ్యమంత్రి ఆదేశాల నేపథ్యంలో పనులకు ఆటంకం కలగకుండా ఏలేరు నీటిని పంపాకు మళ్లించడంలో సాధ్యసాధ్యాలపై ఇరిగేషన్, పోలవరం అధికారులతో చర్చించారు. దీనిపై 3 రోజుల్లోగా నివేదికను ఇవ్వాలని పోలవరం అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ విలేకర్లతో మాట్లాడారు. వేసవిలో నీటిఎద్దడి లేకుండా తీసుకోవలసిన చర్యలపై చర్చించామని.. పంటపొలాల విషయం ఎలా ఉన్నా తాగునీరు పూర్తిస్థాయిలో లేకుంటే ఇబ్బందులు వస్తాయని, అందువల్ల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సత్యనికేతన్ సత్రంలో మద్యంబాటిళ్లు దొరికిన ఘటనపై ఆయన స్పందించారు. ఇప్పటికే నివేదికను తెప్పించడం జరిగిందని, దీనిపై త్వరలో చర్యలుంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, పంపా నీటిసంఘం చైర్మన్ బైరావర్లుల శ్రీరామచంద్రమూర్తి తదితరులున్నారు.


పోలవరం కెనాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

సత్యదేవుని ఆభరణాలను అప్పగించిన పూర్వపు ఈవో

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఖజానాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను మంగళవారం పూర్వపు ఈవో సత్యనారాయణ మూర్తి, ప్రస్తుత ఈవో వీర్ల సుబ్బారావుకు దేవదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారుల సమక్షంలో అందజేశారు. పనిచేస్తున్న ఈవో బదిలీ సమయంలో నూతనంగా నియమించిన ఈవోకు రికార్డుల ప్రకారం అప్పగించాల్సి ఉంటుంది. అయితే సత్యనారాయణమూర్తి 2023లో బదిలీకాగా తదుపరి చంద్రశేఖర ఆజాద్, రామచంద్రమోహన్ ఈవోలుగా బాధ్యతలు స్వీకరించినా సమయాభావం వల్ల వారు ఆభరణాల అప్పగింత చార్జి తీసుకోలేదు. తాజా ఉత్తర్వుల మేరకు దేవస్థానం ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ మంగళవారం ఈవో సుబ్బారావు పర్యవేక్షణలో స్వీకరించారు. ఇకపై ఈవో నుంచి ఈవోకు కాకుండా డిప్యూటీ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ ఆధీనంలో ఈ ఆభరణాలు ఉంటాయి. డిప్యూటీ కమిషనర్ బదిలీ అయితే తదుపరి డిప్యూటీ కమిషనర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. సత్యదేవునికి సుమారు 70 కిలోల బంగారం, 3 వేల కిలోల వెండి ఆభరణాలు ఉన్నట్టు తెలుస్తుంది.


ఆభరణాలను అప్పగిస్తున్న పూర్వపు ఈవో

చోరీ కేసులో నిందితుల అరెస్టు

32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం


ఏలేశ్వరంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ


స్వాధీనం చేసుకున్న వెండి, బంగారు ఆభరణాలు

ఏలేశ్వరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత నెల 9వ తేదీన కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని శ్రీసిద్ధనాద్ జ్యూయలర్స్ నందు జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మంగళవారం ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న జ్యూయలరీ దుకాణం వెనుక భాగం నుంచి ఆగంతకులు చొరబడి 50 గ్రాముల బంగారు ఆభరాలు, 32 కిలోల వెండి అపహరించిన విషయం విదితమే. దీనిపై ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ రామలింగేశ్వరరావు దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు యర్రవరం వెళ్లే రోడ్డులో తిరుమాలి జంక్షన్ దగ్గర వాహనాలకు తనిఖీ చేస్తుండగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి వివరాలను తెలుసుకున్నారు. కడప జిల్లా రాజంపేట మండలం అత్తిరాల గ్రామానికి చెందిన కరణం కుమార్, అల్లూరి మండలం చలంగారిపల్లె గ్రామానికి చెందిన గుమ్మళ్ల వెంకట సుబ్బయ్యను అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై రాష్ట్రంలో పలు కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వారి నుంచి ఏలేశ్వరం దోపిడీకి సంబంధించి 32 గ్రాముల బంగారం, 11 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కేసును ఛేదించిన సీఐ,ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంగళవారం సాయంత్రం మార్కెట్ సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కెఎస్‌ఆర్ నగర్‌కు చెందిన పల్లె జీవరత్నం (70) మృతిచెందాడు. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. జీవరత్నం మోటారు సైకిల్‌పై పాతబస్టాండు నుంచి కెఎస్‌ఆర్ నగర్ వెళ్తుండగా వెనుక వైపు నుంచి వస్తున్న సాలూరు డిపోకు చెందిన బస్సు వెనుక చక్రం కింద పడిపోయాడు. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతిచెందాడు. ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారి పడి...

తుని రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రేగుపాలెం యలమంచిలి మధ్యలో జరిగింది. సుమారు 50ఏళ్ల వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి భద్రపరచినట్టు ఇన్‌చార్జ్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వివరాలు తెలిస్తే 9490619020లో సంప్రదించాలని కోరారు.

అన్నవరంలో అపూర్వ స్వాగతం

సైకిల్ ర్యాలీ చేస్తున్న సీఐఎస్‌ఎఫ్ బృందానికి హారతులిచ్చిన మహిళలు


బృంద సభ్యులకు హారతి ఇస్తున్న మహిళలు

అన్నవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమృద్ధి, సంరక్షణ పేరుతో దేశంలో ఉన్న 6500 కిలోమీటర్ల సముద్ర తీరప్రాంత ప్రజల్లో దేశ భద్రత, సమైక్యతను పెంపొందించాలనే ఉద్దేశంతో చేపట్టిన సీఐఎస్‌ఎఫ్ (కేంద్ర పారిశ్రామిక భద్రత దళం) చేపట్టిన సైకిల్ ర్యాలీకి కాకినాడ జిల్లా అన్నవరంలో అపూర్వ స్వాగతం లభించింది. గ్రామంలోకి చేరుకోగానే సర్పంచ్ కుమార్‌రాజా స్వాగతం పలకగా మహిళలు హారతులిచ్చారు. మార్చి 7న పశ్చిమబెంగాల్ బికిలీ నుంచి 60మంది సీఐఎస్‌ఎఫ్ దళంతో ప్రారంభమైన ఈ సైకిల్ యాత్ర 2700 కిలోమీటర్ల సాగి కన్యాకుమారితో ముగుస్తుందని బృందం పేర్కొంది. ఈ దళం ఏర్పాటై మార్చి 10 నాటికి 55 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. మంగళవారం రాత్రికి అన్నవరం సత్యదేవుని సన్నిధిలో బస చేసి బుధవారం ర్యాలీ ప్రారంభిస్తామన్నారు.


అన్నవరం చేరుకున్న సీఐఎస్‌ఎఫ్ బృందంతో స్థానికులు

తుపాకీతో సంచారం

పోలీసుల అదుపులో అనుమానితుడు


కాకినాడ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు స్టేట్ బ్యాంక్ సమీపంలో తుపాకీతో సంచరిస్తున్న ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని తిమ్మాపురం పోలీసులు కాకినాడ రూరల్ పోలీస్ కార్యాలయానికి తరలించారు. సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. సదరు వ్యక్తి బ్యాంక్ కొల్లగొట్టడానికి వచ్చాడన్న ప్రాథమిక సమాచారంతో విచారణ చేపట్టారు. వాస్తవాలు వెల్లడి కావడంతో ఆ దిశగా పోలీసులు నిర్ధారణ చేసుకున్నారు. అనుమానితుడిని పోలీసులు విచారిస్తున్నారు.

రుణాలిప్పిస్తామని మోసం

రూ.2,500 చొప్పున వసూలు

సర్పవరం జంక్షన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తి సంఘాల గ్రూపులకు రుణాలిప్పిస్తామని చెప్పి ఒక్కో గ్రూపు సభ్యుల నుంచి రూ.25వేలు వసూలు చేసి మోసం చేసినట్టు పలువురు మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ వలసపాకలలోని బంధన్ బ్యాంకులో డ్వాక్రా సభ్యులకు రుణాలు ఇప్పిస్తామని చెప్పి బ్యాంకుకి చెందిన ఇద్దరు క్షేత్రస్థాయి సిబ్బంది 3గ్రూపుల నుంచి ఒక్కో సభ్యురాలి నుంచి రూ.2,500 చొప్పున వసూలు చేశారని పలువురు మహిళలు ఆరోపించారు. పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేయిస్తానని నమ్మబలికిన బ్యాంకు రికవరీ సిబ్బంది గణేష్, ఉదయ్‌భాస్కర్ తన వద్ద నుంచి రూ.1.45 లక్షలు తీసుకున్నారని ఏడిద సూర్యకుమారి తెలిపింది. మరో గ్రూపునకు రుణాల మంజూరు కోసం రూ.2.30 లక్షలు తీసుకున్నట్టు ఆర్.చిన్నఅమ్ములు తెలిపింది. లోన్ కోసం లంచం తీసుకున్నా లోన్ మంజూరు కాకపోవడంతో వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని బంధన్ బ్యాంకు బ్రాంచి మేనేజర్ సూరిబాబుకు ఫిర్యాదు చేసినట్టు తెలిపింది. విచారణ జరిపి న్యాయం చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు తెలిపింది. ఈ విషయమై మేనేజర్‌ని వివరణ కోరగా ఇద్దరు సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నట్టు సూరిబాబు తెలిపారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా బ్యాంకుకి వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాళ్లపూడి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పెద్దేవం శివారులో రావూరుపాడు బస్ షెల్టరు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. మరణించిన వ్యక్తి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంది. 4రోజులుగా ఇక్కడేఉంటూ చుట్టుపక్కల వారు పెట్టింది తింటూ మంగళవారం మృతి చెందాడు. వివరాలు తెలిస్తే తాళ్లపూడి పోలీసులకు తెలపాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పంటబోదెలో మృతదేహం

ద్రాక్షారామ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ద్రాక్షారామ- కోటిపల్లి రోడ్డు పక్క పంటబోదెలో అన్నాయిపేటకు చెందిన గట్టి సతీష్ (44)మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. మృతుడి భార్య గట్టి పెద్దింట్లమ్మ ఫిర్యాదుతో హెచ్‌సీ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. సతీష్‌కు తరచూ ఫిట్స్ వస్తుంటాయి. 2రోజుల క్రితం బయటకు వెళ్లిన సతీష్ తిరిగిరాలేదు. ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని, తన భర్త మరణంపై ఎటువంటి అనుమానాలు లేవని భార్య ఫిర్యాదులో పేర్కొందని పోలీసులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సాయం

మలికిపురం, మార్చి18(ఆంధ్రజ్యోతి): మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు మలికిపురంలోని ఫైనాన్స్ వ్యాపారులు రూ.25వేలను మంగళవారం ఎస్ఐ పి.సురేష్‌కు అందజేశారు. మలికిపురం ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఫైనాన్స్ వ్యాపారులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

అంతర్వేది, మార్చి18(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం ఒక గ్రామంలో బాలిక చెయ్యి పట్టుకుని ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువకుడు లాగాడు. ఆమె పట్టుకున్న చెయిని గట్టిగా కరిచి కేకలు వేసింది. స్థానికులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. యువతితల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

12వ పీఆర్సీని నియమించి.. ఐఆర్ ప్రకటించాలి

పెన్షనర్స్ అసోసియేషన్ కోనసీమ జిల్లా శాఖ డిమాండ్



స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ సమావేశంలో మాట్లాడుతున్న సాయివరప్రసాద్

అమలాపురం రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల వేళ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీని నియమించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కోనసీమ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. వెంటనే ఉద్యోగులు, పెన్షనర్లకు మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. జిల్లా పెన్షనర్స్ కార్యాలయంలో మంగళవారం ఎం.సాయివరప్రసాద్ అధ్యక్షతన జిల్లాలోని అన్ని యూనిట్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పెన్షనర్లకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి పది నెలలు గడిచినా పెన్షనర్లకు సంబంధించి ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రతీ నెల మొదటి వారంలోనే పెన్షన్లు జమ చేస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మండల స్థాయి నుంచి అసోసియేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు శాశ్వత సభ్యులను చేర్చుకోవాలని సాయివరప్రసాద్ సూచించారు. సెప్టెంబరు లోగా జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వం పెన్షనర్లకు మూడు విడతల కరువు భృతి చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఇంత వరకు చెల్లించలేదని రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ఎస్ సీహెచ్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. కోశాధికారి జి.సోమేశ్వరశర్మ ఆర్థిక నివేదికను సభ ముందు ఉంచారు. సమావేశంలో వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు వై.సత్తిరాజు, ఏవీ సుబ్బారావు, ఏవీవీ సత్యనారాయణ, డి.సత్యనారాయణ, జీవీఎస్ సత్యనారాయణ, జి.నరసింహారావు, వైఎస్ జగన్మోహనరావు, టీవీ శర్మ, వై.పాండురంగారావు, మండలీక ఆదినారాయణ, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, మహబూబ్ షా హీరా తదితరులు పాల్గొన్నారు.

పూర్తయిన పనులకు టెండర్లు పిలవడం ఏమిటి?

- ర్యాటిఫికేషన్‌తో చేయాల్సిన పనులు కౌన్సిల్ మీదకు నెడతారా!
- ఐదు టెండర్లు రద్దు
- కౌన్సిల్ అత్యవసర సమావేశం



అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం దృశ్యం

అమలాపురం టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడో పూర్తిచేసిన పనులకు ఇప్పుడు టెండర్లు పిలవడం ఏమిటని అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్లు సంసాని వెంకటచంద్రశేఖర్ ప్రశ్నించారు. చైర్‌పర్సన్ ర్యాటిఫికేషన్‌తో పూర్తి చేయాల్సిన పనులను కౌన్సిల్ మీదకు నెడతారా అని మండిపడ్డారు. అధికారులకు ఉన్న అధికారాన్ని వదిలేసి లక్షలాది రూపాయల పనులను కౌన్సిల్‌పై రుద్దుడం ఏమిటని ప్రశ్నించారు. మొత్తం టెండరు నోటీసులను రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టర్ల మధ్య విబేధాలుంటే వారు చూసుకోవాలి అంతేగానీ కౌన్సిల్‌ను బాధ్యులు చేయడం ఎంతవరకు సమంజసమని పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఇంజనీరింగ్ విభాగంలో కొందరు కాంట్రాక్టర్లకు మాత్రమే అధికారులు వత్తాసు పలకడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర పేర్కొన్నారు. పూర్తిచేసిన పనులకు సంబంధించి ఎజెండా అంశాలు 116 నుంచి 120 వరకు పిలిచిన టెండర్లను రద్దు చేస్తున్నట్టు కౌన్సిల్ తరపున నాగేంద్ర ప్రకటించారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం 122 ఎజెండా అంశాలతో మంగళవారం చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన సమస్యలపై అధికార, విపక్ష కౌన్సిలర్లు అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ప్రస్తుత కౌన్సిల్ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతుందని, కనీసం కాటన్ పార్కును శుభ్రంచేసే పరిస్థితి లేకుండా పోయిందని కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు పేరిట ఉన్న పార్కులో అభివృద్ధి పనులకు పురపాలక సంఘం తరపున సొమ్ములు కేటాయిస్తున్నారని, ఇంత వరకు ఏ ఒక్క అభివృద్ధి పని జరగలేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. ఆట వస్తువుల నుంచి ఎన్నో పాడైపోయాయని, ఎందుకు పనులు చేయడం లేదని, అసలు కాంట్రాక్టరు ఎవరు అని మండిపడ్డారు. 10 వార్డులకు అవసరమైన తాగునీటిని అందించే ఓహెచ్ఎస్సార్ ట్యాంకును ఎందుకు ప్రారంభించడం లేదని కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి ప్రశ్నించారు. పట్టణంలో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని కౌన్సిలర్ యేడిద శ్రీను పేర్కొన్నారు. పారిశుధ్య వర్కర్లకు మేస్త్రీలు సెలవులు ఇచ్చి వారి వద్ద నుంచి సొమ్ములు గుంజుకుంటున్నారని సంసాని బులినాని ఆరోపించారు. పారిశుధ్య వర్కర్లను సప్లింగ్ చేయాల్సిన ఆవశ్యకత ఉందని కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు పేర్కొన్నారు. పురపాలక సంఘంలో 196మంది శానిటేషన్ సిబ్బంది ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. అసలు 30 వార్డుల్లో ఎంతమంది పనిచేస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. మున్సిపల్ వాటర్ వర్క్స్ వద్ద తీసేసిన పైపులు, పాత ఇనుప సామగ్రి తరలించుకుపోతున్నా పట్టించుకోరా అని కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ప్రశ్నించారు. అదే విధంగా ఎలక్ట్రికల్ సామగ్రి కూడా మాయమైపోతుందని సమావేశం దృష్టికి సభ్యులు తీసుకురాగా దీనిపై తక్షణం హౌస్ కమిటీ వేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల భర్తీ ఎప్పుడు పూర్తవుతుందని సభ్యులు ప్రశ్నించగా రాష్ట్ర వ్యాప్తంగా 500పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత ప్రభుత్వం వార్డు సచివాలయాల్లోని శానిటరీ సెక్రటరీలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లగా కొనసాగించాలన్న విధానాన్ని నేటికీ కొనసాగిస్తున్నామని అధికారులు వివరణ ఇవ్వడం విశేషం. 31శాతం లెస్‌తో టెండర్లు ఎలా ఆమోదిస్తారని కౌన్సిలర్లు తిక్కా సత్యలక్ష్మి, సంసాని బులినానిలు ప్రశ్నించారు. ఎలక్ట్రికల్ మెటీరియల్ వచ్చిన తరువాత సభ్యులందరికీ చూపించాలని డిమాండ్ చేశారు. 10వ వార్డులోని లేఅవుట్‌లో రోడ్డు నిర్మాణానికి కేటాయించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను ఈ నెలాఖరులోగా ఖర్చుచేసి రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు షార్ట్ టెండర్లు పిలవాలని సమావేశం తీర్మానించింది.

లక్షల లక్షలు కేటాయిస్తున్నాం..

అమలాపురం పురపాలక సంఘంలో చెత్తను సేకరించే ట్రాక్టర్లలో ఒక్కటి కూడా పూర్తి ఫిట్‌నెస్‌తో లేకుండా పోయిందని, ఏటా లక్షల లక్షలు కేటాయిస్తున్నా ఒక్క ట్రాక్టరును కూడా పూర్తిస్థాయిలో సిద్ధం చేయలేరా అని అధికార విపక్ష కౌన్సిలర్లు అధికారుల తీరుపై మండిపడ్డారు. డ్రైవర్ ఒక చేత్తో స్టీరింగ్, మరో చేత్తో గొడుగు పట్టుకుని డ్రైవింగ్ చేయాల్సిన దుస్థితి ఏమిటని సెల్‌ఫోన్‌లో తీసిన ఫొటోలను జనసేన, టీడీపీ కౌన్సిలర్లు యేడిద శ్రీను, బొర్రా చిట్టిబాబులు చూపించారు. లక్షల లక్షలు కేటాయిస్తున్నామని, అయితే అధికారులు రూల్ పొజిషన్‌ను కాదని వ్యవహరిస్తున్న తీరుపై కౌన్సిలర్ నాగేంద్ర మండిపడ్డారు. ట్రాక్టర్లు బాగుచేసే కాంట్రాక్ట పనిని సివిల్ కాంట్రాక్టరుకు ఏవిధంగా కట్టబెడతారని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాతృమూర్తి ఇటీవల మృతిచెందగా నిబద్ధతతో సమావేశానికి హాజరైన ఆయన్ను అభినందిస్తూ ఆయన తల్లి మృతికి రెండు నిమిషాలు సభ్యులు, అధికారులు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

పెద్దింట్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



లలితా సహస్రనామ పారాయణం చేస్తున్న భక్తులు

అంతర్వేది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం చిన్నకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం వద్ద మహిళా భక్తులు లలితా పారాయణం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి వేచి ఉన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ప్రసాదం కౌంటర్, టిక్కెట్ కౌంటర్, సత్తెమ్మ అమ్మవారి ఆలయాలను పరిశీలించారు. క్యూలైన్‌లో అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను దేవదాయశాఖ చేస్తున్న సేవలపై అసిస్టెంట్ కమిషనర్ ఆరా తీశారు.

బూత్ కమిటీల ఏర్పాటుకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పాలూరి సత్యానందం

అంతర్వేది, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బీజేపీ సఖినేటిపల్లి మండల పార్టీ సమావేశం ఇందుకూరి సుబ్బరాజు ఇంటి వద్ద పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మండల ఇన్‌చార్జి పాలూరి సత్యానందం మాట్లాడారు. పూర్తిస్థాయిలో 60 బూత్ కమిటీలు నిర్మాణం చేసేవిధంగా మండలంలో కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నరేంద్రమోదీ నేతృత్వంతో అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. పార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని మండల కమిటీ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. ఎమ్మెల్సీగా సోము వీర్రాజు నియమితులవ్వడం పట్ల బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తంచేశారు. పార్టీ కార్యాలయానికి రెండు సెంట్ల భూమిని ఇచ్చిన రాష్ట్ర డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజును అభినందించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిమాలే శ్రీనివాసనగేష్, కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, అడబాల రాంబాబు, పట్టాపు సూర్యప్రకాశరావు, బోనం నాయుడు, పోతురాజు నాగరాజు, బళ్ల సత్యనారాయణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాడైన రోడ్లను ఆధునికీకరించాలి

మామిడికుదురు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో ఓఎన్జీసీ బావులు ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రోడ్లను ఆధునికీకరించాలని స్థానికులు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పాశర్లపూడిలోని జాతీయరహదారి నుంచి పాశర్లపూడిలంక వరకు ఓఎన్జీసీకి చెందిన 15బావులు ఉన్నాయని, 35ఏళ్ల నుంచి ఓఎన్జీసీ తమ కార్యకలాపాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. 30ఏళ్ల క్రితం వేసిన రోడ్లపైనే ఓఎన్జీసీకి చెందిన వాహనాలు తిరుగుతున్నాయని, దానివల్ల ఆ రోడ్లు పాడై అధ్వానంగా తయారైనప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మతులు కూడా చేయలేదన్నారు. అధ్వాన రోడ్లను ఆధునికీకరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వేగి లక్ష్మీనారాయణ, పోతుమూడి నానాజీ, ఉప్పే శ్రీను, మెల్లం రాజు, బి.రమేష్, బులిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ బహూకరణ

రాజోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కడలిలో కొలువుతీరి ఉన్న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి కడలి మెయిన్ యూత్‌సభ్యులు రూ.13వేలు విలువైన ఇన్వర్టర్‌ను మంగళవారం బహూకరించారని ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు మంగళవారం తెలిపారు. యూత్ సభ్యులను ఈవో సత్యనారాయణరాజు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. సూరిశెట్టి శ్రీనివాసరావు, గాలిదేవర వెంకన్నబాబు, వడ్లమూడి ప్రకాష్ పాల్గొన్నారు.

సునీత విలియమ్స్‌కు వివేకానంద విద్యార్థుల స్వాగతం

మలికిపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సునీత విలియమ్స్ ఆకృతిలో ఒదిగి వివేకానంద విద్యార్థులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. తొమ్మిది నెలల అంతరిక్ష వాసం ముగించుకుని భారత సంతతికి చెందిన నాసా వ్యోమగాములు సునీత విలియమ్స్, విల్మోర్‌లు బుధవారం తెల్లవారుజామున భూమికి తిరిగి రానున్న నేపథ్యంలో సునీత అంటూ మానవహారంగా ఏర్పడి స్వాగతం పలికారు. ఐఎస్ఎస్‌లో తొమ్మిది నెలల పాటు గడపాల్సి వచ్చినా సునీత ఎక్కడా డీలా పడలేదని, మొక్కవోని ఆత్మస్థైర్యం ప్రదర్శించారని కొనియాడారు. ఒక్కొక్కసారి పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా ఆత్మస్థైర్యంతో యావత్తు ప్రపంచానికి స్ఫూర్తిగా నిలిచారని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణ కలిగి ఉంటే ఇటువంటి అద్భుతాలు సాధించవచ్చునన్నారు. సునీతయూ ఆర్ గ్రేట్ అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

ఎంటీయూ 1426 రకంతో అధిక దిగుబడి



అయినవిల్లి, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వరిలో ఎంటీయూ 1426 రకంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మడుపల్లి గ్రామంలో రైతు నాగప్రసాద్ సాగుచేస్తున్న ఎంటీయూ 1426 రకం వరి పంటను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, మార్టేరు పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ గిరిజారాణి (ప్రధాన శాస్త్రవేత్త వరి పంట), డాక్టర్ సుధారాణి (ప్రధాన శాస్త్రవేత్త), డాక్టర్ భువనేశ్వరి, ఏరువాక కేంద్రం అమలాపురం కోఆర్డినేటర్ డాక్టర్ నందకిశోర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ డాక్టర్ రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి వై.శోభ పరిశీలించారు. ఈ పంట 125-130 రోజులకు కోతకు వస్తుందన్నారు. ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు దిగుబడి వస్తుందని, చీడపీడలు అంతగా సోకలేదని, భవిష్యత్తులో ఈ రకాన్ని సన్నరకంగా ప్రాచుర్యం పొందగలదన్నారు.

కోకో గింజలకు అంతర్జాతీయంగా డిమాండ్



అయినవిల్లిలంకలో కోకో రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి ప్రసన్నలక్ష్మి

అయినవిల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా పండించే కోకో గింజలకు జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉందని ఉద్యాన అధికారిణి ఎన్.ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం అయినవిల్లిలంకలో కోకో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వాతావరణ పరిస్థితులతో పాటు మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలను రూ.950 నుంచి రూ.వెయ్యి వరకు కొనుగోలు చేశారన్నారు. నేడు ధర రూ.550 నుంచి రూ.650కు పడిపోయిందన్నారు. పక్వానికి వచ్చిన కాయలు కోసి గింజలను తీసే క్రమంలో గుజ్జుతో కలిపి పులియబెట్టే విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు చేసి చూపించారు. పులియబెట్టిన గింజలను ఐదు రోజుల తరువాత బయటకు తీసి ట్రేలలో నిల్వ ఉంచాలన్నారు. అనంతరం ఆరుబయట ఎండలో ఆరబెట్టాలని సూచించారు. అప్పుడు నాణ్యమైన గింజలు దిగుబడిగా వస్తాయన్నారు. వాటికి బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందని ప్రసన్నలక్ష్మి వివరించారు. ఉద్యానశాఖ ప్రతినిధులతో పాటు రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

రాజోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తాటిపాక, కడలి యూనిట్ల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా తాటిపాకలో రాజోలు ఎంపీపీ కేతా శ్రీనును వ్యవసాయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల గురించి తెలిపారు. వ్యవసాయశాఖ, ఎన్ఆర్ఈజీఎస్, డీఆర్డీఏ వారి సహకారంతో ఆకుకూరలు, కాయగూరలు వల్ల రైతులకు అదనపు ఆదాయం చేకూర్చడానికి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీ జోసెఫ్ తెలిపారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ గ్రామాలుగా తయారు చేయడం కోసం కన్వర్జన్సీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు, పి.ప్రసన్నకుమార్ తెలిపారు.

మంత్రిని కలిసిన ఎంపీపీ కేతా



రాజోలు, మార్చి18(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం దిండి రిసార్ట్స్‌లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎంపీపీ కేతా శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి శ్రీను-వెంకటలక్ష్మి దంపతులు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి నారాయణరెడ్డి ఎంపీపీ కేతాతో రాజోలునియోజకవర్గం గురించి చర్చించారు.

రోగులకు అందుబాటులో ఉండాలి

అంబాజీపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్య కేంద్రాల్లో వైద్యాధికారులు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సమావేశం ఇన్‌చార్జ్ వైద్యాధికారి రవికుమార్ అధ్యక్షతన జరిగింది. వేసవి దృష్ట్యా పీహెచ్‌సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు.

'పైడిరాజు కుటుంబానికి న్యాయం చేయాలి'



సఖినేటిపల్లి పోలీసుస్టేషన్‌ను ముట్టడించిన రాజు కుటుంబ సభ్యులు

అంతర్వేది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సినిమాహాలు సెంటర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన కారు రోడ్డు ప్రమాదంలో బత్తిన పైడిరాజు (23) మృతిచెందడంపై మంగళవారం రాజు కుటుంబ సభ్యులు గుడిమూల, రామేశ్వరం, గుడిమూల ప్రజలు పోలీసుస్టేషన్‌ను ముట్టడించారు. బత్తిన పైడిరాజు అక్కడికక్కడే మృతిచెందినా మాకు సరైన న్యాయ జరగడం లేదని తల్లిదండ్రులు, బంధువులు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొబ్బరి దింపులు తీసేందుకు వలస వచ్చామని మా ఆవేదన అర్థం చేసుకుని రాజు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. దీనిపై ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్‌ను వివరణ కోరగా పైడిరాజు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పశువుల దొడ్డి నిర్మాణానికి సహకరించాలి

అంతర్వేది, మార్చి 18(ఆంధ్రజ్యోతి): అంతర్వేది, కేశవదాసుపాలెం, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో పశువులు రోడ్లపై విచ్చలవిడిగా సంచరించడంతో పలు ప్రమాదాలు సంభవించి పలువురు గాయాల పాలవ్వడం ఇటీవల జరిగింది. పశువులను నియంత్రించేందుకు అంతర్వేది సమీపంలో ఎన్జీవోల సహకారంతో బందెల దొడ్డి నిర్వహించేందుకు దాతలు సహకరించాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కోరారు. రోడ్లపై ఆవులు, గేదెలను వదిలేస్తున్న యజమానులు స్వచ్ఛందంగా బంధించుకోకపోతే త్వరలో ఏర్పాటుచేసే బందెల దొడ్డిలో బంధించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



యానాం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. ఆలయం వద్ద జరుగుతున్న పనులను మంగళవారం మల్లాడి కమిటీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పుదుచ్చేరికి చెందిన కాంట్రాక్టర్‌తో ఆలయం ప్రహరీ నిర్మాణ పనులు చేయిస్తున్నారు. కొత్తపేట గ్రామదేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. త్వరలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించి గ్రామస్తులు మల్లాడితో చర్చించారు.

అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

అంబాజీపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన 2047 విజన్‌లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మురళీకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రణాళిక ప్రకారం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారుల సలహాలు పాటిస్తామన్నారు. త్వరలో ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అంబాజీపేట, పి.గన్నవరం ఎంపీడీవోలు సరోవరరావు ఉన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన పడమటిపాలేనికి చెందిర రావి వెంకటేశ్వరరావుకు ఫెండ్స్ హోప్ హెల్పింగ్ ఫౌండేషన్ రూ.10వేలు ఆర్థిక సహాయం, రూ.2500 విలువైన నిత్యావసర వస్తువులు అందించారు. అదేవిధంగా ఏఎస్ఆర్ లైటింగ్స్ అడబాల నరసింహారావు రూ.2500, మంగెన శేషసాయికృష్ణ రూ.2500, పాటబళ్ల సూరిబాబు రూవెయ్యి, పాటబళ్ల శ్రీనివాస్ రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో బోనం రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ముమ్మిడివరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. చెయ్యేరుకు చెందిన పెయ్యల అజయ్‌కుమార్ ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం నక్కావారిపేటలో ఉంటూ చెరువుల వద్ద కాపలాగా ఉంటున్నాడు. భోజనానికి అనాతవరం మోటారుసైకిల్‌పై వెళ్లి తిరిగివస్తూ కొండాలమ్మచింత బైపాస్ రోడ్డులో ఆగి ఉన్న లారీని ఢీకొడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అజయ్‌ను అమలాపురంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

మామిడికుదురు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు కోరారు. ఈనెల28వ తేదీ వరకు ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. మొగలికుదురు, పాశర్లపూడిలంకల్లో ఈనెల 19, 20తేదీల్లో, నగరం, లూటుకుర్రు గ్రామాల్లో 21, 22 తేదీల్లో, మామిడికుదురు, ఈదరాడల్లో 25, 26 తేదీల్లో, పాశర్లపూడి-1లో 27, 28 తేదీల్లో, ఆదుర్రు 27న, కొమరాడలో 28న ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు ఉన్నవారు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద కళ్లకు గంతలతో నిరసన



అల్లవరం మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని, అర్హులైన యువకులకు ఉపాధి, తీర ప్రాంత రక్షణ, ఓడలరేవు టూరిజం, అభివృద్ధి వంటి పలు డిమాండ్లతో ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు చేస్తున్న ఆందోళన మగళవారం 16వ రోజుకు చేరింది. ఓఎన్జీసీ అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులు కళ్లకు నల్ల రిబ్బన్లతో గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఓఎన్జీసీ అధికారులు స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, టెర్మినల్ నిర్మాణ పనులు అడ్డుకుంటామని ఆందోళనకారులు హెచ్చరించారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, గుండుమేను శ్రీనివాస్, పినపోతు రామకృష్ణ, రేకాడి శేషగిరితో పాటు గ్రామస్తులు కళ్లకు గంతలతో నిరసన తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ముమ్మిడివరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ, దృష్టి లోప నివారణ కార్యక్రమంలో భాగంగా అయినాపురం జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 30మంది విద్యార్థినీ విద్యార్థులకు కళ్లజోళ్లను సర్పంచ్ మోకా రామారావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ హేమలత, ఎస్.సత్తిబాబు, హెచ్ఎం టీవీ కృష్ణారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ .పి.లక్ష్మీప్రియ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్కువ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి

పి.గన్నవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ ప్రసవాలు జరిగేలా సిబ్బంది కృషిచేయాలని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి సూచించారు. నాగుల్లంక పీహెచ్‌సీలో మంగళవారం అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి షేక్ జానిమ్ అధ్యక్షతన జరిగింది. వేసవిలో వడగాల్పులు నుంచి రక్షణ పొందేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. సమావేశంలో సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, డిప్యూటీ తహశీల్దారు ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఏక సభ్య కమిషన్ నివేదిక తప్పుల తడక'

ఐ.పోలవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ రాజీవ్‌రంజన్‌మిశ్రా నివేదిక తప్పులతడక అని మాలమహానాడు ఆరోపించింది. పాతయింజరం అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఐ.పోలవరం మండల మాలమహానాడు సమావేశం జరిగింది. ఏకసభ్య కమిషన్ మొదటి నుంచి ఏకపక్ష వైఖరితో సర్వే నిర్వహించి మాదిగల కంటే మాలలు ఒక శాతం మాత్రమే ఎక్కువ అని నివేదిక ఇచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాలల శాతం ఎక్కువ అని తెలిసినా తప్పుడు లెక్కలతో ఇచ్చిన నివేదికను రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలపై చేస్తున్న కుట్రలో భాగమేనని నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే ఉద్యమం చేపడతామని సమావేశం హెచ్చరించింది. రేవు శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో వడ్డి గౌతమ్, మట్టా గగనవీరుడు, నాగాబత్తుల రామకృష్ణ, కాశి పరివాజ్‌కుమార్, సాధనాల బాబూరావు, నల్లా రాజు, మాదేటి పండు, పండు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం దురదృష్టకరం'

రాజోలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదించడం దురదృష్టకరమని రాజోలు మండలం మాలల న్యాయ పోరాట సమితి జేఏసీ సభ్యులు పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జేఏసీ సభ్యులు నిరసన చేపట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా జేఏసీ రాజోలు నియోజకవర్గ ముఖ్య సలహాదారులు బత్తుల మురళీకృష్ణ, జేఏసీ మండల అధ్యక్షుడు మట్టా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2011వ సంవత్సరం జనాభా లెక్కలు తీసుకుని ప్రత్యేకాంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం కేబినెట్ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజ్జి, జిల్లెల్ల వినోద్‌బాబు, చిలకపాటి శ్రీధర్, విప్పర్తి సాయిబాబు, బొడ్డపల్లి పుల్లయ్య, చింతా శ్రీనివాస్, నీతిపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించండి

యానాం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించకపోతే నిరసన తెలియజేయడంతో పాటు బంద్‌కు పిలుపు ఇస్తామని యానాం అన్నడీఎంకే కార్యదర్శి మంచాల సత్యసాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొద్దిరోజులుగా యానాంలో ప్రభుత్వ వ్యవస్థల నిర్లక్ష వైఖరి కారణంగా ఈపరిస్థితి నెలకొందన్నారు. ఇది ఖచ్చితంగా వ్యవస్థల వైఫల్యమేనన్నారు. గురువారంలోగా సమస్యను పరిష్కరించకుంటే శుక్రవారం యానాం బంద్‌కు పిలుపు ఇస్తామన్నారు. ఈవిషయంలో వర్తక, వ్యాపార వర్గాలు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

పసలపూడిలో కొండలా డంపింగ్ యార్డు

● నివాస స్థలాల నుంచి దూరంగా తరలించాలని డిమాండ్



పసలపూడిలో రోడ్డుపక్కన కొండలా మారిన డంపింగ్‌యార్డు

రాయవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి శివారు వెలమపేట సమీపంలో వెదురుపాక రోడ్డులో నివాస స్థలాలకు దగ్గరగా ఉన్న డంపింగ్ యార్డును గ్రామానికి దూరంగా తరలించాలని గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి, నల్లమిల్లి అ ప్పారెడ్డి, ఇమిడిశెట్టి శివయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మా ట్లాడుతూ గతంలో తమ గ్రామంలో డంపింగ్‌యార్డు గ్రామానికి కొంచెం దూరంగా ఉండేద ని సుమారు 8 సంవత్సరాల క్రితం డంపింగ్‌యార్డును ఈస్థలానికి మార్చడంతో అక్కడ చెత్త పేరుకుపోయి డంపింగ్ యార్డు కొండను తలపిస్తోందన్నారు. డంపింగ్‌యార్డు సమీపంలో నివశిస్తున్న ప్రజలనుంచి అనేక అభ్యంతరాలు వచ్చినప్పటికీ డంపింగ్‌యార్డు మార్పు జరగలేదన్నారు. డంపింగ్‌యార్డులో చెత్త కొండను తలపిస్తుండగా నివాసప్రాంతాల్లో ప్రజలకు దోమలు, దుర్వాసన పెరిగిపోవడంతోపాటు వర్షాకాలంలో పాములు, విషసర్పాలు, కీటకాలతో భయాందోళనతో నివశిస్తున్నారన్నారు. దుర్వాసన, దోమలు, రోగాలతో డంపింగ్‌యార్డు నివాసప్రాంత ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి దూరంగా డంపింగ్‌యార్డు తరలించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. పెంకే వెంకటేష్, టేకుమూడి దుర్గాప్రసాద్, కర్రి వెంకటరెడ్డి, మండ రామారెడ్డి, కలి సత్యనారాయణ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.32లక్షలు



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,32,111 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ప్రత్యామ్నాయ ఉపాధి చూపండి

● ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కార్యాయం వద్ద మీటరు రీడర్ల ధర్నా



డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మీటరు రీడర్లు

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి18(ఆంధ్రజ్యోతి):ఏళ్ల తరబడి ఏపీఈపీడీసీఎల్ సంస్థలో మీటరు రీడర్లుగా పనిచేస్తున్న తమకు పత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరుతూ మంగళవారం ఏపీఈపీడీసీఎల్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంవద్ద మీటరు రీడర్లు ధర్నా నిర్వహించారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని లేదా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రం డివిజినల్ ఇంజనీరుకు అందజేశారు. ఈసందర్భంగా మీటరు రీడర్ల అసోసియేషన్ నాయకులు కె.బ్రహ్మాజీ, కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి మీటరు రీడింగ్‌లు తీస్తూ సంస్థలో పనిచేస్తున్నామన్నారు. కరోనా సమయంలో కూడా రీడింగ్‌లు తీసు సంస్థలకు ఆదాయం చేకుర్చామన్నారు. 2024 ఫిబ్రవరి 20న డిస్కం సీఎండీలు, అడిషనల్ సెక్రటరీ చర్చలు సందర్భంగా ప్రకటించిన విధంగా తమకు ఉద్యో గ భద్రత చేకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామచంద్రపురం డివిజల్‌లో మీటరు రీడర్లు, నాయకులు కె.సుబ్బారావు, సునీల్, అనిల్, ముని పాల్గొన్నారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలి: ఆర్డీవో

ఆలమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నాడ గ్రామంలో జరుగతున్న రీ సర్వే పనులు త్వరితగతిని పూర్తి చేయాలని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ సూచించారు. ఆలమూరు రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అధ్యక్షతన మండల రెవెన్యూ ఉద్యోగులు, సర్వేయర్లుతో సమీక్ష నిర్వహించారు. జొన్నాడ, మూలస్థానం రీసర్వే పనులు అప్పగించిన సిబ్బంది సర్వే పనులపై దృష్టి పెట్టి త్వరగా పూర్తిచేయాలని, అలాగే మండలంలో రైతులు పెట్టుకుంటున్న అర్జీలను పరిష్కరించాలని సర్వేలలో వచ్చిన లోపాల సవరణ కోసం చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు, మండల సర్వేయర్ ప్రభావతి మండల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

వేసవి ఇబ్బందులపై దృష్టి పెట్టండి : ఐసీడీఎస్ పీడీ

ఆలమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు కలుగకుం డా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాధిరిని, జిల్లా ఐసీడీఎస్ ప్రాజక్టు డైరెక్టర్ పి.శాంతికుమారి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎ.రా జు అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఆమె వివిధ శాఖల ఉద్యోగులతో చర్చించారు. వేసవిలో పీహెచ్‌సీల ద్వారా వైద్య సదుపాయాలు సక్రమంగా అందించాలని వైద్యులతో అన్నారు. పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిషోర్‌తో వైద్య సదుపాయాలపై చర్చించారు. మండలంలో తాగునీటి ఎదడి లేకుండా చర్యలు చేపట్టాలని ట్యాంకుల ద్వారా నీరు సక్రమంగా సరఫరా చేయాలని ముఖ్యంగా క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేయించాలన్నారు. మండలంలో ఈక్రా ప్ బుకింగ్‌పై వ్యవసాయాధికారిని లక్ష్మిలావణ్యతో చర్చించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆయా శాఖల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 28నుంచి ప్రారంభం కాను న్న చింతలూరు నూకాంబికా ఉత్స వాల ఏర్పాట్లుపై పలు శాఖల అధికారులతో చర్చించారు. జాతరకు సమిష్టికి సహకరించి విజయవంతంగా పూర్తి చేయాలని శాంతకుమారి అన్నారు. పదో తరగతి పరీక్షలు, డ్వాక్రా రుణాలు, ఉపాధి హామీ పనులపై ఉద్యోగులతో చర్చించారు.ఎంపీడీవో ఎ.రాజు, ఐసీడీఎస్ సీడీపీవో గజలక్ష్మి, ఏవో లక్ష్మిలావణ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పద్మ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా దాళ్వా వరి పంట

● అధిక ఉష్ణోగ్రతలతో పెరుగుతున్న కాండం తొలుచు పురుగు



ఆలమూరులో దాళ్వా వరి పంటపై మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

ఆలమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా దాళ్వా వరిసాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇటీవల పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలవల్ల కాండం తొలిచే పురుగుతోపాటు, దోమపోటు వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతవారం పదిరోజులుగా తెల్లవారుజామున అధికంగా మంచు పడటంతోపాటు పగటిపూట అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఆశాజనకంగా ఉన్న పంట దెబ్బతింటుదేమోనని ముందు జాగ్రత్తగా అనేక ప్రాంతాలలో రైతులు వివిధ రకాల క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. వరిపైరు కాండం వచ్చే సమయంలో గుళికలను ఉపయోగించిన రైతులు కాండం తొలిచే పురుగు బెడద తక్కువగా ఉంటుందని, వీటిని ఉపయోగించని వారు మాత్రం ఈ సమయంలో మందు ఉపయోగించినప్పటికీ ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రత అధికంగా ఉండటంవల్ల దోమపోటు పెరిగే సూచనలు కనిపించడంతో రైతులు ముందుజాగ్రత్తగా వాటిని అణచివేయాలని మార్కెట్లో లభిస్తున్న అనేక రకాల దోమ మందులను ఉపయోగిస్తూన్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో రైతులు ఉదయం పూట పంట భూములలో మందులు పిచికారీ చేస్తూ కనిపిస్తున్నారు. ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలోని ఆలమూరు, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలో దాళ్వాలో 55వేల ఎకరాలలో సాగు జరుగుతుంది. దీనిలో ఎంటీయు 1121 రకం 50 శాతం సాగు చేస్తుండగా ఎంటీయు 3626 రకం మిగిలిని శాతం సాగు జరుగుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. సబ్‌డివిజన్‌లో 55వేల ఎకరాలలో ఈక్రాప్ నమోదు జరిగింది.

మొవ్వు పురుగుతో అప్రమత్తంగా ఉండాలి

● కె.నాగేశ్వరరావు, ఏడీఏ ఆలమూరు



దాళ్వావరిసాగు ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఆశాజనకంగా ఉంది. ఎటువంటి ఇబ్బందులు లేవు. రైతులు ముందుజాగ్రత్తగా అధికంగా మందులు ఉపయోగిస్తున్నారు. దోమ అదుపులో ఉంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంవల్ల మొవ్వు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా దోమపట్ల రైతుల పైరును ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.

ఉపాధి హామీ నిధులు పెంచాలి

●శాసనసభలో కోరిన మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల



మండపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ నిధుల కేటాయింపులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు అన్యాయం జరుగుతోందని మండపేట శాసన సభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. ఈ మే రకు మంగళవారం ఆయన శాసనసభ ప్రశ్నో త్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు. పొరుగున ఉన్న కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలతో పోలిస్తే ఈజిల్లాకు కేటాయింపులు తక్కువగా ఉన్నా య న్నారు. నిధుల కేటాయింపులో అందరికీ న్యాయం చేయాలని కోరారు.

50 ఏళ్లకే బీసీలకు పింఛన్ ఎక్కడ

● శాసన మండలిలో ఎమ్మెల్సీ తోట సూటి ప్రశ్న



మండపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన బీసీ లకు 50 ఏళ్లదాటితే పింఛన్ ఎన్నికల హామీ ఏమైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శాసన మండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. ఇలాంటి మోసపూరిత హామీలను ఇచ్చి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఏ ర్పడి 9నెలలు కావస్తున్న ఇచ్చిన హామీలు నిల బెట్టుకోలేక పోయిందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. టీడీపీ సీనియర్ నేత యనమలకు రాజ్యసభ ఇవ్వాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మంగళ వా రం అమరావతిలో శాసనమండలి శాసన సభ్యులు ఫొటోసెషన్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఎమ్మెల్సీ త్రిమూర్తులు కలిశారు.

అలరించిన కూచిపూడి నృత్యం

కొత్తపేట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి వాడపాలెం గ్రామదేవత మారెమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని నాట్యగురువు పోలారావు శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. ప్రదర్శన తిలకించిన ఆహూతు లు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం నాట్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. నాట్యగురువు పోలారావును ఆలయ కమిటీ ఆధ్వర్యం లో ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యానికి మేలు

ద్రాక్షారామ, మార్చి18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ రంగారావు పేర్కొన్నారు. మంగళవారం రామచంద్రపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై మండలస్థాయి కన్వెన్సీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో రంగారావు మాట్లాడు తూ వివిధ రకాల విత్తనాలు వేయడం కారణంగా సూ ర్యరశ్మి నేరుగా భూమిని తాకకుండా ఉండటంతో భూమిలో సూక్ష్మజీవులు, వానపాముల ఉధృతి పెరుగుతుందన్నారు. ఎన్‌ఎఫ్‌ఏ హేమలత మాట్లాడుతూ 30 రకాల విత్తనాలతో ప్రకృతి వ్యవసాయం సాగవుతుందని పంటల వైవిధ్యం వలన భూమిలో జీవవైవిధ్యం పెరిగిన పంటలకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. ప్రధాన పంటకు రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సూర్యకుమారి, కార్యవర్గ సభ్యులు, ఏపీఎం అర్జున్, ఎంటి బాబూరావు, మండల వ్యవసాయాధికారి సత్యప్రసాద్, వీవోఏలు, వీఏలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మాం సేవలు అభినందనీయం



గుత్తుల వీరబ్రహ్మాంను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఆలమూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం గుత్తుల వీరబ్రహ్మాం చేసిన సేవలు చిరస్మరనీయమని పలువురు వక్తలు అభివర్ణించారు. రాష్ట్ర బీసీ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన సందర్భంగా ఆలమూరులో మంగళవారం గుత్తుల వీరబ్రహ్మాంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలమూరు మండల ఎంఈవోలు బి.అప్పాజీ, సుబ్బరాజు, మండపేట ఎంఈవో ఎస్.రామచంద్రరావు, తణుకు డీవైఈ వో మురళీసత్యనారాయణ, ఆలమూరు ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్, ఉద్యోగసంఘాల నాయకులు వైవీ రమణ, వాకా గోవిందరాజు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రత్యేక దృష్టి

● సీఐడీ సీఐ జేమ్స్ రత్నప్రసాద్

రావులపాలెం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాల పట్ల సీఐడీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని సీఐ జేమ్స్ రత్నప్రసాద్ అన్నారు. రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల మేరకు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐడీ సీఐలు జేమ్స్ రత్నప్రసాద్, కేపే స్వామి, వి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మహిళల చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. లైంగిక వేధింపులు, బెదిరింపులకు గురవ్వడం వంటివి జరుగుతున్న కొంత మంది మహిళలు బయపడి వాటిని బయటపెట్టకుండా మానసికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. మహిళలకు ఆపద సమయంలో రక్షణ కల్పించేందుకు ఎన్నో చట్టాలు ఉన్నాయన్నారు. వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలో యువతులపై ర్యాగింగ్, ప్రేమ పేరుతో మోసగించడం వంటి కార్యలకలపాలు జరుగుతున్నాయని వాటిపై ప్రత్యేకించి పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. రోజురోజుకి సైబర్ నేరాలు పెరుగుతున్న నేపధ్యంలో అపరచిత వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీలు అడిగితే చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి అరుణకుమార్ పాల్గొన్నారు.

మండపేటలో ప్రత్యేక ఆధార్ సెంటర్‌లు ఏర్పాటు: కమిషనర్ రంగారావు

మండపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఆదేశాల మేరకు మండపేట పట్టణంలో ఈనెల 19 నుంచి 22 వరకు, 25నుంచి 28వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. 5నుంచి 15 సవంత్సరాల వయస్సు కలిగిన పిల్లలు ఆధార్ అప్‌డేట్, బయోమెట్రిక్ తప్పనిసరి అని ఆయన చెప్పారు. ఈనెల 19, 20న ఆరవ సచివాలయం కేపీ రోడ్డు, తహసీ ల్దార్ కార్యాలయం వద్ద, ప్రకాశం స్కూల్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద, 21, 22న కచేరిచావిడి, 7వ సచివాలయంవద్ద, 9వ సచివాలయంవద్ద, వల్లూరివారివీధి, 25న, బాపూజీ స్కూల్, అంగన్‌వాడీకేంద్రం 26న, ఎస్.ఎస్.వీ.వీ. మున్సిపల్ హైస్కూల్, సత్యశ్రీరోడ్డు, 27, 28న బాపూజీ మున్సిపల్ స్కూల్, 1వ సచివాలయం గొల్లలగుంటలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను నిర్వహిస్తామని, పట్టణ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చేనేతలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

మండపేట, మార్చి18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత కార్మికులకు మేలుచేసేలా రాష్ట్రం ప్రభుత్వం మగ్గంకు 200 యూనిట్లు, మరమగ్గంకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వటం పట్ల రాష్ట్ర దేవాంగ చేనేత విభాగపు ఉపాధ్యక్షుడు కాశీనకాశీవిశ్వనాధం హర్షం వ్యక్తంచేశారు. సీఎం, డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మండపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా రామకృష్ణ



చింతపల్లి రా మకృష్ణ



మెటిపల్లి బాపీరాజు

మండపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మండపేట మం డలం ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల చినద్వారపూడికి చెందిన చింతపల్లి రామకృష్ణ, వైస్‌ఛైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం చినకోరుమిల్లికి చెందిన మెటిపల్లి బాపీరాజును నియమించినట్లు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిందని ఎమ్మెల్యే తెలిపారు. బీసీకి కేటాయించిన ఛైర్మన్ పదవి చింతపల్లికి కేటాయించగా వైస్‌ఛైర్మన్ పదవి కాపు సామాజిక వర్గం బాపిరాజుకు కేటాయించారు.

కాపునాడు నియోజకవర్గ కన్వీనర్‌గా శ్రీనివాసరావు



కె.గంగవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవాసమితి రామచంద్రపురం ని యోజకవర్గం కన్వీనర్‌గా మసకపల్లి గ్రామానికి చెందిన గెడ్డం శ్రీనివాసరావు నిమితులయ్యారు. ఈ మేరకు కాపునాడు సేవాసమితి జాతీయ అధ్యక్షుడు మల్లెల శివనాగేశ్వరరావు నియామకపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో కాపునాడు సేవా సమితి ద్వారా కాపుల సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు.

నీటి సంఘం అధ్యక్షుడి మృతికి సంతాపం

కె.గంగవరం, మార్చి18(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెలంపాలెం నీటి సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు వల్లూరి సురేష్ అకాల మృతి పార్టీకి, రైతాంగానికి తీరని లోటని దాట్ల విజయ గోపాల్ రాజ్(డీసీ కోటిపల్లి), నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు(డీసీయద్రపో తవరం), నీటి సంఘాల అధ్యక్షులు ములకల విశ్వేశ్వరరావు(కోట), తాడాల లోవరాజు (గంగవరం), ఎనుముల గోపాల కృష్ణ(కూళ్ల), ఆచంట శ్రీనివాసు(యండగండి)లు అన్నారు. సురేష్ మృతికి వారు సంతాపం ప్రకటించారు. సురేష్ కుటుంబానికి వారి సానుభూతిని తెలిపారు.

నాలుగేళ్లలో రూ.27కోట్ల అభివృద్ధి పనులు చేశాం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాణి వెల్లడి

మండపేట, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండపేట ము న్సిపల్ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి నాలు గేళ్లయిందని ఇప్పటివరకు పట్టణంలో రూ.25కోట్లలతో అభివృద్ధి పనులు చేశానని చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి చెప్పారు. ఈమేరకు ఆమె మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన నాలుగేళ్ల పదవీకాలంలో తనకు సహకరించిన పట్టణ ప్రజలకు ప్రజాప్రతినిధులు అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మరో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని ఆమె చెప్పారు.

400లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సీఐ కాత్యాయని ఆధ్వర్యంలో మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా రాజవరం గోదావరి లంకలో దాడు లు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసిన్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ అన్నవరం తెలిపారు.

'ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి విజయవంతం చేయండి'

రాయవరం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు వ్యతిరేకంగా బుధవారం రాష్ట్రంలో చేపట్టే ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ కన్వీనర్ పండు అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారంరాత్రి మండలంలోని మాచవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర జనాభాకు సంబంధించి తా జా వివరాలు అందుబాటులో లేనప్పటికీ 2011 జనాభాను పరిగణలో తీసుకుని ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమో దం తెలపడం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో కాకర రాము, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి కూలీ మృతి

ఆత్రేయపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పురుగులు మందు సేవించి కూలి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన అవిడి గణపతి(45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గణపతికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసయ్యాడు. పది రోజుల క్రితం పిట్స్ వచ్చి అనారోగ్యానికిగురై ఇంటి వద్దే ఉంటున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన గణపతి ఈనెల 16న తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్త సంపద కేంద్రాలతో సేంద్రియ ఎరువుల తయారీ

● జిల్లాపంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి



ద్వారపూడిలో చెత్త సంపద కేంద్రం రంగులు వేసి సిద్ధ చేసిన దృశ్యం



మండపేట, మార్చి18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వున్న గ్రామపంచాయతీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త సంపద కేంద్రాల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేసి సంపద సృష్టించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంత లక్ష్మీ తెలిపారు. జిల్లాలో వున్న 387 పంచాయతీలు ఉండగా కేవలం 268 పంచా యతీ ల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఇంకా 117 చెత్తసంసద కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో పంచాయతీలకు సంబంధించి చెత్తను వేసేందుకు అవసరమైన డంపింగ్ స్థలాల సమస్య జిల్లాలో తీవ్రంగా వేధి స్తుందన్నారు. జిల్లామొత్తం మీద 45 పంచాయతీలకు సంబంధించి చెత్తను వే సేందుకు అవసరమైన స్థల సేకరణ జరగాల్సి ఉందన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా గ్రామాల్లో శానిటేషన్ మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఆమె ఆంధ్రజ్యోతికి తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. గ్రామాల్లో పన్నులు వసూళ్లను వేగవంతం చేశామని ఆమె చెప్పారు. జిల్లా మొత్తంమీద రూ.44కోట్ల మేర పన్నులు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 70శాతంమేర రూ.30 కోట్ల మేర ఇంటి పన్నులు వసూలు చేశారన్నారు. మిగిలిన పన్నులు మార్చి నెలఖరుకు వసూలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. పన్నుల వసూళ్ల కోసం తమ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించామన్నారు. రోడ్డుపక్కన చెత్తవ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా చెత్తసేకరణ విషయంలో తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీకి చెందిన శానిటరీ సిబ్బంది వచ్చినపుడు వారికి ఇవ్వాలని ఆమె కోరారు. చెత్త నుంచి సంపద సృష్టించేం దుకు చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా ఇప్పటి వరకు మూలకుచేరిన చెత్తసంపద కేంద్రాలను పనిచే సేలా తీర్చిదిద్దామన్నారు. ద్వారపూడి గ్రామపంచాయతీ పరిధిలో వేములపల్లిలో వున్న చెత్తసంపద కేంద్రంను ఆధునికీకరించి చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారు చేసేందుకు సిద్ధం చేశామని పంచాయతీ కార్యదర్శి ఎ.వీ.వీ.రమణ తెలిపారు.

చెత్తతో తయారయ్యే ఎరువులతో సంపద

కపిలేశ్వరపురం: చెత్తతో తయారయ్యే ఎరువులతో సంపద సృష్టించవచ్చని డీఎల్‌పీవో ఐదంరాజు, ఎంపీడీవో కె.రత్నకుమారిలు అన్నారు. మోడల్ విలేజ్ అయిన అంగరలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్త సేకరణ, నిర్వహణపై నిర్వహించిన ఒకరోజు శిక్ష ణా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించడం, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి తీసుకువచ్చి నాడెప్ కిట్లలో తడిపొడి చెత్తనువేసి దానిపై పేడపూత ప్రతీరోజు కిట్టు నిం డే వరకు పూయడం, 45 రోజులు పూర్తయిన అనంత రం తడిచెత్తను వర్మీకిట్లలోకి మార్చి 60రోజులు పూర్తయిన అనంతరం సేంద్రీయ ఎరువు టీపొడి రూపంలో తయారవడం, వీటిని వినియోగించడం, తదితర అంశా లపై వివరించారు. ప్రతీఒక్కరూ డ్రైన్లలోగానీ, రోడ్లప్రక్కనగానీ చెత్తవేయకుండా క్లాత్‌మిత్రాలు వచ్చినప్పుడు ఇచ్చేవిధంగా చూడాలని ఈవోపీఆర్డీ ఆర్.మోహన్ కార్యదర్శులకు సూచించారు. కార్యదర్శులు శివచక్రవర్తి, కామేశ్వరరావు, అంగన్‌వాడీటీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంగరలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో రాజు

కేశవస్వామి ఆలయంలో అడబాల పూజలు



ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ

ఆత్రేయపురం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): పురాన ప్రసిద్ధిగాంచిన ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఉమిడిశెట్టి వెంకటేశ్వరరావు ఇంట జరిగిన పార్టీ నేతల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం చేస్తున్నామని ప్రతి బూత్ నందు బీజేపీ జెండా ఎగరాలన్నారు. పూర్తిస్థాయి నుంచి మండల స్థాయి వరకూ పార్టీని బలోపేతంచేసి ప్రధాని నరేంద్రమో దీ అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి చీకురుమిల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు, మండల ప్రధాన కార్యదర్శి తాడాల సుబ్రహ్మణ్యం, రమేష్, జి.రాంబాబు, వీరభద్రం పాల్గొనారు.